





# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 311 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 17 జూలై 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :311 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 17 JULY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## హస్తినలో ముగిసిన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం

- జలశక్తి శాఖ మంత్రి ఆధ్వర్యంలో చంద్రబాబు, రేవంత్ రెడ్డి సమావేశం
- దాదాపు గంటన్నర పాటు సమావేశం
- కేంద్రం ఎదుట వాదనలు వినిపించిన ఇరు రాష్ట్రాలు



పెన్ పవర్ డెస్క్:తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం ముగిసింది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన సుమారు గంటన్నర పాటు ఈ సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కేంద్రమంత్రి సమావేశమయ్యారు.గోదావరి - బనకచర్ల ప్రాజెక్టు అనుసంధానం సింగిల్ పాయింట్ ఎజెండాగా ఆంధ్రప్రదేశ్.. 13 అంశాలతో తెలంగాణ ఈ సమావేశంలో పాల్గొన్నాయి. ఇరు రాష్ట్రాలు తమ తమ వాదనలను కేంద్రం ముందు ఉంచాయి. ఈ సమావేశంలో ముఖ్యమంత్రులతో పాటు ఇరు రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులు నిమ్మల రామానాయుడు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, జలవనరుల శాఖ కార్యదర్శులు, ఇంజినీర్లు హాజరయ్యారు.

## పిల్లలకు హిందీ కంటే ఇంగ్లీష్ నేర్చుకోవడం ముఖ్యం

- 'హిందీ భాష'పై జగన్ ఏమన్నారంటే...!
- హిందీ భాషపై రాజకీయ రగడ
- హిందీ నేర్చుకోవడంలో తప్పులేదన్న జగన్
- అయితే విద్యార్థుల భవిష్యత్ కోసం ఇంగ్లీషుకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:దక్షిణ భారతదేశంలో హిందీ భాషపై తీవ్ర చర్చ జరుగుతున్న నేపథ్యంలో వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. హిందీ భాషను నేర్చుకోవడంలో ఎలాంటి తప్పు లేదని, అయితే విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇంగ్లీష్ మీడియం విద్యకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు.

వివరాలు 2లో..

## మంగళగిరిలో మరో 2వేలమందికి త్వరలో ఇళ్ల పట్టాలు


- మంగళగిరిలో ఇళ్లులేని పేదలకు టిడ్కోఇళ్లకు ప్రణాళికలు
- మహానాడు రిటైనింగ్ వాల్‌తో పాటు పార్కు నిర్మాణం
- త్వరలోనే సమీకృత అండర్ గ్రౌండ్ ప్రాజెక్టు నిర్మాణ పనులు
- మంగళగిరి నియోజకర్గ అభివృద్ధి పనులపై మంత్రి లోకేశ్ సమీక్ష



పెన్ పవర్ డెస్క్:మంగళగిరి నియోజకవర్గ పరిధిలో దీర్ఘకాలంగా వివిధ ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న మరో 2వేల మందికి ఆగస్టు నెలలో శాశ్వత ఇళ్ల పట్టాలు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులపై మంత్రి ఈ రోజు ఉండవల్లి నివాసంలో అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... గతంలో 3వేల

వివరాలు 2లో..

# ఏడాదిలో 10లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం




- ఢిల్లీలో సీఎం చంద్రబాబు పర్యటన
- వరుస సమావేశాలతో బిజీగా చంద్రబాబు
- చంద్రబాబును కలిసి నివేదిక అందించిన స్వర్ణాంధ్రప్రదేశ్-2047' టాస్క్ ఫోర్స్
- చంద్రబాబు ఓ విజనరీ అని పేర్కొన్న సీఐఐ డైరెక్టర్
- హైదరాబాద్ ఐటీలో దూసుకుపోవడానికి చంద్రబాబే కారణమన్న టాటా చైర్మన్




పెన్ పవర్ డెస్క్:: ఏపీలో తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏడాదిలో 10లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని సీఎం చంద్రబాబు తెలిపారు. వచ్చే ఏడాది 13 లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. 'స్వర్ణాంధ్రప్రదేశ్-2047'పై టాటా సంస్థల ఛైర్మన్ చంద్రశేఖరన్ నేతృత్వంలో ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ తమ నివేదికను సీఎంకు దిల్లీలో అందజేసింది. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధికి నివేదికలో టాస్క్‌ఫోర్స్ పలు సూచనలు చేసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. "ప్రస్తుతం కాలంలో సాంకేతికత అనేది గేమ్ ఛేంజర్. ఈ సాంకేతిక యుగంలో ప్రభుత్వాల వద్ద ప్రజల డేటా ఉంటుంది. రాష్ట్రంలో ఆగస్టు 15 నుంచి వాట్సప్‌లో మరిన్ని పౌర సేవలు అందుబాటులో వస్తాయి. కుప్పం నుంచి డిజిటల్ హెల్త్ కార్డుల కార్యక్రమం చేపడతాం. ఏపీలో చాలా అవకాశాలు ఉన్నాయి. విశాఖ, విజయవాడ, తిరుపతి వ్యాపారానికి అనుకూల నగరాలు. విశాఖకు గూగుల్ రాబోతోంది. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం పీ-4 పాలసీ తీసుకొచ్చాం" అని చంద్రబాబు వివరించారు. ఏపీ సీఎం చంద్రబాబు ఢిల్లీలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఇవాళ వరుస సమావేశాలతో చంద్రబాబు ఎంతో బిజీగా గడిపారు. ఈ క్రమంలో, స్వర్ణాంధ్రప్రదేశ్-2047పై టాటా గ్రూప్ చైర్మన్ చంద్రశేఖరన్ నేతృత్వంలోని టాస్క్ ఫోర్స్ బృందం ఢిల్లీలో ఏపీ సీఎం చంద్రబాబును కలిసింది.

వివరాలు 2లో..

## టెలీమెట్రీలకు ఆంధ్రప్రదేశ్ అంగీకరించింది

### తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



- రిజర్వాయర్లు, కెనాళ్ల వద్ద టెలీమెట్రీలు ఏర్పాటు చేస్తామని ఏపీ చెప్పిందని వెల్లడి
- యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేస్తామని చెప్పిందన్న మంత్రి
- గత ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించిందని విమర్శలు

వివరాలు 2లో..

## అమెరికాలో కరోనా కొత్త వేరియంట్లు... పెరుగుతున్న కేసులు



- అగ్రరాజ్యంలో కరోనా కలకలం
- ప్రస్తుతం యూఎస్ లో వేసవి సెలవులు... జోరుగా ప్రయాణాలు చేస్తున్న ప్రజలు
- వేగంగా వ్యాపిస్తున్న కరోనా వైరస్

పెన్ పవర్ డెస్క్:యావత్ ప్రపంచాన్ని కరోనా మహమ్మారి ఎంతగా వణికించిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. లక్షలాది మంది ఈ వైరస్ భూతం బారినపడి ప్రాణాలు కోల్పో యారు. సకాలంలో వ్యాక్సిన్లు రావడంతో ప్రపంచ దేశాలు ఊపిరి పీల్చుకున్నాయి. లేకుంటే మరింత జన నష్టం సంభవించేది. తాజాగా అమెరికాలో కరోనా వైరస్ మరోసారి కలకలం సృష్టిస్తోంది. గత కొన్ని రోజులుగా అగ్రరాజ్యంలో కరోనా బారిన పడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం అమెరికాలో వేసవి కాలం కావడంతో, సెలవులను ఆస్వాదించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున ప్రయాణాలు చేస్తున్నారు. తీర ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలకు తరలిపోవడం వల్ల వైరస్ వేగంగా

వివరాలు 2లో..

## నాడు మీరేం చేశారు?... చర్చకు సిద్ధమా?: జగన్ కు నాదెండ్ల మనోహర్ సవాల్

- జగన్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్న నాదెండ్ల
- జగన్ అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం
- ప్రజల తీర్పును అర్థం చేసుకోవాలని హితవు

వివరాలు 2లో..



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వ్యవహా రాలు, ఆహారం మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై

## సీఎంల సమావేశం సుహృద్భావ వాతావరణంలో జరిగింది

- ఢిల్లీలో తెలుగు రాష్ట్రాల సీఎంల కీలక సమావేశం
- హాజరైన చంద్రబాబు, రేవంత్ రెడ్డి, ఇరు రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రులు
- సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన నిమ్మల రామానాయుడు



పెన్ పవర్ డెస్క్:ఢిల్లీ వేదికగా కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో జరిగిన తెలుగు రాష్ట్రాల సీఎంల సమావేశంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య దీర్ఘకాలంగా నెలకొన్న జల వివాదాలపై చర్చలు సానుకూల వాతావరణంలో జరిగాయని ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. ఈ సమావేశం అనంతరం రామానాయుడు

వివరాలు 2లో..

## 'పీఎం ధన్ ధాన్య కృషి యోజన'కు మంత్రివర్గం ఆమోదం

- కీలక నిర్ణయాలు తీసుకున్న కేంద్ర మంత్రివర్గం
- శుభాంశు శుక్లాను అభినందిస్తూ తీర్మానం
- మంత్రివర్గ సమావేశ వివరాలను వెల్లడించిన అశ్వినీ వైష్ణవ్



పెన్ పవర్ డెస్క్: కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. 'పీఎం ధన్ ధాన్య కృషి యోజన' పథకానికి ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు అభివృద్ధి లక్ష్యంగా దేశవ్యాప్తంగా 100 జిల్లాల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. 2025-26 నుంచి ఆరేళ్ల కాలానికి ఈ పథకం 100 జిల్లాలను కవర్ చేసేలా ప్రణాళిక రూపొందించారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను పెంచడం, పంటల్లో వైవిధ్యీకరణ,

వివరాలు 2లో..

# ప్రసన్నకుమార్ రెడ్డిపై చర్యలు తీసుకుంటున్నాం



- ప్రశాంతిరెడ్డిపై ప్రసన్న వ్యాఖ్యలను కోర్టులు కూడా తప్పుపట్టాయన్న అనిత
- జగన్ మానవత్వం ఉన్న వ్యక్తిలా వ్యవహరించడం లేదని మండిపాటు
- సొంత చెల్లెలు గురించే తప్పుడు ప్రచారం చేసిన చరిత్ర జగన్ దని విమర్శ

పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్ మానవత్వం ఉన్న మనిషిలా వ్యవహరించడం లేదని ఏపీ హోంమంత్రి అనిత మండిపడ్డారు. జగన్ నుంచే ప్రసన్నకుమార్ రెడ్డి నేర్చుకున్నారని... మహిళా (ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి) నేతపై ప్రసన్నకుమార్ రెడ్డి వ్యాఖ్యలను న్యాయస్థానాలు కూడా తప్పుపట్టాయని చెప్పారు. ప్రసన్నపై చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రసన్న తీరును జగన్ తప్ప ఎవరూ సమర్థించడం లేదని అనిత విమర్శించారు. రక్తం పంచుకుని పుట్టిన సొంత చెల్లెలు గురించే తప్పుడు ప్రచారం చేసిన చరిత్ర జగన్ దని మండిపడ్డారు.

బెట్టింగ్ యాప్ లలో డబ్బులు పోగొట్టుకుని ఆత్మహత్య చేసుకున్నవారి కుటుంబాలను, రౌడీషీటర్లను జగన్ పరామర్శిస్తున్నారని చెప్పారు. జగన్ పర్యటనల్లో ఒకసారి తలకాయను, మరోసారి మామిడికాయలను తొక్కించారని అన్నారు. రప్పా రప్పా నరుకుతామని అనడం తప్పుకాదా? అని ప్రశ్నించారు.

## ఎడిటర్ వ్యూ

# యూటర్న్ తీసుకున్నట్లేనా?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ దాదాపు రెండు గంటల పాటు మీడియా సమావేశం పెట్టారు. అందులో అన్ని అంశాలను ప్రస్తావించారు. అన్నివర్గాల ప్రజలకు తాము అండగా ఉంటున్నామని చెప్పారు. కానీ ఒక్క విషయంలో మాత్రం ఆయన స్పందించలేదు. అదే ఇప్పుడు రాజకీయంగానూ, రాజధాని అమరావతిలోనూ హాట్ టాపిక్ గా మారింది. జగన్ మైండ్ సెట్ మారినట్లుందని సోషల్ మీడియాలో సెటైర్లు వినిపిస్తున్నాయి. అనేక అంశాలను ప్రస్తావించిన జగన్ రాజధాని రైతుల విషయాన్ని మాత్రం పూర్తిగా పక్కన పెట్టేశారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం మరో ఇరవై వేల ఎకరాల ల్యాండ్ పూలింగ్ ద్వారా భూ సమీకరణకు నిర్ణయించిన నేపథ్యంలో జగన్ ఆ ప్రస్తావన లేకుండా సమావేశాన్ని ముగించారు.

**అనేక సమస్యలను ప్రస్తావించి...**

మిర్చి, పొగాకు, మామిడి రైతుల సమస్యలను ప్రస్తావించారు. కరేడు లో భూ సేకరణపై కూడా జగన్ మండిపడ్డారు. మూడు పంటలు పండే భూమిని ఎలా సేకరిస్తున్నారని ప్రశ్నించారు. కరేడు రైతులు తనను కలిశారని, వారికి అండగా వైసీపీ నిలబడుతుందని మీడియా సమావేశంలో చెప్పారు. కానీ రాజధాని రైతులు రెండో విడత భూ సమీకరణకు అంగీకరించకపోయినా వారి గురించి మాట్లాడకపోవడం చర్చనీయాంశంగా మారింది. రాజధాని రైతుల పై ఆగ్రహంతోనే జగన్ వారికి మద్దతుగా మాట్లాడలేదా? లేక జగన్ తన మైండ్ సెట్ ను మార్చుకున్నారా? అన్న చర్చ జరుగుతుంది. అనేక సమస్యలపై పోరాటానికి సిద్ధమని ప్రకటించిన జగన్ రాజధాని భూముల ప్రస్తావన మాత్రం తేలేదు.

**భూ సమీకరణ పై...**

గతంలో అసెంబ్లీ సమావేశంలోనే రాజధాని నిర్మాణానికి ముప్పయి వేల ఎకరాల భూములు అవసరమా? అని ప్రశ్నించిన జగన్ ఇప్పుడు మరో ఇరవై వేల ఎకరాలు సమీకరించడానికి ప్రభుత్వం సిద్ధమయినా ఎందుకు ప్రశ్నించలేదన్న దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తానే అంతకు ముందు అవసరమైతే మరిన్ని భూములు సేకరించాలని తాను అన్నమాటలు జగన్ కు గుర్తుకు వచ్చి ఉండవచ్చని కొందరు నెట్టింట నిలదీస్తున్నారు. అయితే ప్రభుత్వం రెండో విడత ల్యాండ్ పూలింగ్ ద్వారా భూ సమీకరణ విషయంలో కొంత వెనక్కు తగ్గినట్లు ప్రచారం జరుగుతున్నా అది తాత్కాలికమేనని, ఖచ్చితంగా భూ సమీకరణ మరో ముప్ఫయి వేల ఎకరాలను సేకరిస్తామని అధికారులు చెబుతున్నారు.

**గత ఎన్నికల ముందు వరకూ...**

గత ఎన్నికల్లో వైసీపీ అధినేత జగన్ మూడు రాజధానుల అంశంతో జనం ముందుకు వెళ్లి బోల్తాపడ్డారు. మూడు రాజధానుల ప్రతిపాదనను మూడు ప్రాంతాల్లో జనం అంగీకరించలేదని 2024 ఎన్నికల ఫలితాలు తేల్చి చెప్పాయి. దీంతో గత కొన్నాళ్ల నుంచి మూడు రాజధానుల అంశం జగన్ నోటి వెంట నుంచి రావడం లేదు. పైగా ఇటీవల ఆయన గుంటూరు – విజయవాడను కలుపుతూ రాజధాని నిర్మాణం చేపడితే బాగుండేదని కూడా అభిప్రాయపడ్డారంటే ఆ ప్రతిపాదనను విరమించుకున్నట్లే కనపడుతుందంటున్నారు. అందుకే జగన్ రాజధాని అమరావతి విషయంలో జరిగే విషయాలను కొంతకాలం పరిశీలించిన తర్వాత మాత్రమే రెస్పాండ్ కావాలని భావిస్తున్నట్లుంది. అందుకే రెండు గంటల పాటు జరిగిన మీడియా సమావేశంలో రాజధాని అమరావతి పేరు కూడా తేకుండా జగన్ జాగ్రత్త పడ్డారంటున్నారు.

# ఏడాదిలో 10లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం

- మొదటి పేజీ తరువాయి

ఏపీ ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధిపై తాము రూపొందించిన నివేదికను ఆయనకు అందజేసింది. ఈ కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, తదుపరి ఏడాది రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు. విశాఖపట్నం నగరానికి గూగుల్ వస్తోందని... విశాఖతో పాటు తిరుపతి, విజయవాడ నగరాలు కూడా వాణిజ్యానికి అనుకూలమని వెల్లడించారు.

**సీఎం చంద్రబాబుపై సీఐఐ డైరెక్టర్, టాటా చైర్మన్ ప్రశంసల వర్షం**

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు విజనరీ నాయకత్వం హైదరాబాద్‌ను ఐటీ రంగంలో అగ్రగామిగా నిలబెట్టిందని ప్రముఖ పారిశ్రామికవేత్తలు కొనియాడారు. "పీపీటీ (%ర్రా%) అంటే ఏంటో మాకే తెలియని రోజుల్లో, ఒక రాజకీయ నాయకుడిగా చంద్రబాబు గారు పవర్ పాయింట్ ప్రజంటేషన్ లు ఇచ్చి, పెట్టుబడులని ఆకర్షించే వాళ్ళు. దావోస్ లాంటి ప్రదేశాల్లో కూడా ఉదయం 7 గంటలకు మొదలు పెట్టి, అర్ధరాత్రి వరకు, తమ రాష్ట్రానికి పెట్టుబడుల కోసం కృషి చేసిన నేత చంద్రబాబు గారు" అంటూ సీఐఐ డైరెక్టర్ చంద్రజిత్ బెనర్జీ కొనియాడారు. టాటా సన్స్, టాటా గ్రూప్ చైర్మన్ చంద్రశేఖరన్ కూడా ఇదే అభిప్రాయం వెల్లడించారు. "ఈ రోజు హైదరాబాద్ ఐటీలో దూసుకుపోతుంది అంటే, అది చంద్రబాబు గారి విజన్.. మానవ వనరుల కోసం నాడు ఇంజనీరింగ్ విద్యా సంస్థలు కూడా పెట్టిన విజన్ చంద్రబాబు గారిది. ఆ రోజుల్లో ఐటీ అభివృద్ధి కోసం, మాతో ఉదయం 6 గంటల నుంచే చర్చలు మొదలు పెట్టే వారు. అదీ... చంద్రబాబు గారికి ఉన్న ప్యాషన్" అని చంద్రశేఖరన్ వివరించారు.

ఢిల్లీలో 'స్వర్ణాంధ్రప్రదేశ్-2047' టాస్క్ ఫోర్స్ బృందం సభ్యులు సీఎం చంద్రబాబును కలిశారు. తాము రూపొందించిన నివేదికను ఆయనకు సమర్పించారు. ఈ కార్యక్రమంలోనే పైవిధంగా స్పందించారు.

## మంగళగిరిలో మరో 2వేలమందికి త్వరలో ఇళ్ల పట్టాలు

- మొదటి పేజీ తరువాయి

మందికి సుమారు వెయ్యి కోట్ల విలువైన ఇళ్ల పట్టాలు అందజేశామని, ఆగస్టులో మరో 2వేల పట్టాలు ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలన్నారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో ఇళ్లు లేని పేదల కోసం కొత్తగా టిడ్కో గృహ సముదాయాల స్థలసేకరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మంగళగిరిలోని ప్రస్తుత టిడ్కో సముదాయం వద్ద పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎంటీఎంసీ పరిధిలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న సమీకృత అండర్ గ్రౌండ్ డ్రైనేజి, వాటర్, గ్యాస్, పవర్ ప్రాజెక్టును సాధ్యమైనంత త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో సీఎస్ఆర్, ప్రభుత్వ నిధులతో నిర్మించ తలపెట్టిన 31 కమ్యూనిటీ హాళ్లు, 26 పార్కులు, శ్మశానాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## తిరుమల ఘాట్ రోడ్డు లోయలో దూకిన భక్తుడు : ప్రాణాలకు తెగించి కాపాడిన సిబ్బంది

తిరుమల కొండలు అంటే ఎంత పవిత్రం.. ప్రతి అడుగు అక్కడ గోవిందనామంతో ప్రతిధ్వనిస్తోంది.. ఎన్ని కష్టాలు ఉన్నా ఒక్కసారి గోవిందుడిని దర్శించుకుంటే చాలు అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తోంది. అలాంటి కొండపై.. తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో.. మోకాళ్ళ పర్వతం సమీపంలోని అవ్వాచారి కోన దగ్గర ఓ భక్తుడు కొండ పైనుంచి దూకేశాడు. అవ్వాచారి కోన దగ్గర నుంచి లోయలోకి దూకేశాడు ఓ భక్తుడు. 2025, జూలై 16వ తేదీ ఉదయం జరిగిన ఈ ఘటన కలకలం రేపింది. వ్యక్తి లోయలోకి దూకటాన్ని గమనించిన భక్తులు.. అధికారులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలిసిన వెంటనే స్పాట్ కు చేరకున్న తిరుమల కొండ రెస్క్యూ టీం.. ఆ వ్యక్తిని కాపాడే ప్రయత్నం చేసింది. లోయ చాలా చాలా లోతు ఉండటం.. దట్టంగా ఉండటంతో తిరుమల కొండ రెస్క్యూ సిబ్బంది ప్రాణాలకు తెగించి మరీ ఆ వ్యక్తిని బయటకు తీసుకొచ్చారు. పెద్ద తాళ్ల సాయంతో లోయలోకి వెళ్లిన సిబ్బంది.. ఆ తర్వాత నిచ్చెనలు వేసి లోయలోకి దిగారు. కొద్దిదూరం వెళ్లిన తర్వాత.. దూకిన వ్యక్తి ఆచూకీ దొరికింది.

ఆ వ్యక్తి నడవలేని స్థితిలో ఉండటంతో.. అతనికి తాళ్లు కట్టి.. నిచ్చెన ద్వారా లోయ లోనుంచి బయటకు తీసుకొచ్చారు సిబ్బంది. అతన్ని తిరుమల అశ్విని ఆస్పత్రికి తరలించారు. వ్యక్తిగత వివరాలు కూడా స్పష్టంగా చెప్పలేకపోతున్నాడని చెబుతున్నారు తిరుమల పోలీసులు. తన పేరు రాయుడు అని.. ఆళ్లగడ్డ అని ఒకసారి.. తాడిపత్రి అని ఒకసారి చెబుతున్నాడని.. చికిత్స తర్వాత విచారణ చేసి పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు తిరుమల పోలీసులు. ప్రాణాలకు తెగించి.. ఎంతో సాహసం చేసి మరీ లోయలో పడిన వ్యక్తిని కాపాడిన సిబ్బందికి భక్తులు హ్యాట్సాఫ్ చెబుతున్నారు.

# కారంచేడు మారణహోమానికి 40 ఏళ్లు




కారంచేడు ఘటన దేశంలోనే దళితుల ఆత్మగౌరవ ఉద్యమానికి ఒక ప్రతీకగా నిలిచింది.తెలుగు నేలపై సామాజిక ఉద్యమాలకు దళితులు తన నెత్తుటితో అంకురార్పణ చేసిన ఘట్టానికి కారంచేడు ఉద్యమం ఒక స్ఫూర్తి. ప్రకాశం జిల్లాలోని కారంచేడు ఘటనా దళితుల విముక్తి పోరాటాలకు ఒక ప్రతీక. ఆదిపత్య కులాల దురంహకారాన్ని, దౌర్జన్యాన్ని కళ్లకు కట్టినట్లు చూపించిన ఘటన కారంచేడు మారణహోమం. కారంచేడు కమ్మ భూస్వాముల దాడిలో అమరులైన ఆరుగురిని స్మరిస్తూ ఏటా దళిత సంఘాలు, కవులు, కళాకారులు, ప్రజాస్వామికవాదులందరూ జూలై 17న కారంచేడు మృతవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తుంటారు. ఆనాటి కారంచేడు ఘటనకు నేపథ్యం ఏమిటని పరిశీలిస్తే 1985 జూలై 16న అంటే ఘటనకు ముందురోజు కారంచేడు దళితవాడలోని మంచినీటి చెరువు (మాదిగ కుంట)లోకి పశువులు తాగిన కుడితి నీటిని పోతిన శ్రీనివాసరావు చెరువులో పోయడంపై ఊరిలోని కమ్మ భూస్వాములకు మాదిగ పల్లెకు మధ్య చెలరేగిన వివాదం కారంచేడులో నరమేధానికి కారణమైంది. 1985 జూలై 16న అంటే ఘటనకు ముందురోజు కారంచేడు మాదిగ వాడలోని మంచినీటి చెరువులోకి పశువులు తాగిన కుడితి నీటిని కమ్మ కులానికి చెందిన పోతిన శ్రీనివాసరావు చెరువులోకి పోశాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న దళిత వికలాంగ యువకుడు కత్తి చంద్రయ్య మంచినీళ్లు తాగే చెరువులోకి పశువులు తాగిన కుడితిని ఎందుకు పారబోశావని అడిగాడు. కులదురహంకారం నెత్తికెక్కిన పోతిన శ్రీనివాసరావు నన్నే ప్రశ్నించేంతటి వాడవయ్యావా? అంటూ చర్నాకోలాతో చంద్రయ్యను కొట్టాడు. అంతలోనే మంచినీటి కోసం వచ్చిన దళిత మహిళ మున్నంగి సువార్తమ్మ అన్యాయం అని అడిగిన వికలాంగ యువకుడిని కొట్టడం ఏమిటని గట్టిగా నిలదీసింది. నన్నే ప్రశ్నిస్తావా అంటూ ఆమెను అసభ్య పదజాలంతో దుర్భాషలాడుతూ పొత్తికడుపు మీద తన్నాడు. ఆత్మ గౌరవం కోసం మున్నంగి సువార్తమ్మ తన చేతిలో ఉన్న మంచినీటి బిందెతో తిరగబడింది. దానికి అవమానంగా భావించిన శ్రీనివాసరావు అంతటితో ఆగక కారంచేడు చుట్టు పక్కల గ్రామాలైన స్వర్ణ, కుంకలమర్రు, నాగులపాలెం, జాగర్లమూడికి చెందిన కమ్మ కులస్తుల్ని రెచ్చగొట్టి రాములోరి గుడి దగ్గర రాయినీడు ప్రసాద్, చాగంటి నాయుడమ్మ (వడ్డీల నాయుడు), చాగంటి కృష్ణారావు, మద్యంషాపు రాయినీడు సీతారామయ్యలతో పాటు మరికొందరి ఆధ్వర్యంలో అర్ధరాత్రి వరకు సమావేశం ఏర్పాటు చేశారు. రాములోరి గుడి దగ్గరే కారంచేడు మాదిగ పల్లెపై దాడికి ప్రణాళిక రచించారు. జూలై 17న తెలతెలవారుతున్న వేళ కత్తులు, బరిశెలు, గండ్రగొడ్డళ్లు చేతబట్టి మాదిగపల్లెపై దాడికి పాల్పడ్డారు. ప్రాణాలు అరచేతబట్టుకుని పంటపొలాల్లోకి పరుగులు తీసిన దళితుల్ని జింకను వేటాడినట్లు వేటాడి నరికి చంపారు. వీళ్ళు ఇంతటి నరమేధానికి, రాక్షసత్వానికి పాల్పడతారని బాధితులు ఊహించనే లేదు. అగ్రవర్ణాల పదునైన అధికార కత్తులకు ఈ నరమేధంలో తేళ్ళ యెహోషువా, దుడ్డు వందనం, తేళ్ల ముత్తయ్య, దుడ్డు రమేశ్, తేళ్ళ మోషే, దుడ్డు అబ్రహాంతో సహా మొత్తం ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, వందలాది మంది క్షతగాత్రులయ్యారు. తర్వాత కొడుకు హత్యకు ప్రత్యక్ష సాక్షి అయినందుకు దుడ్డు ఆలీసమ్మను విషప్రయోగంతో హత్య చేశారు. నేటికి బాధితులు ఆశించిన స్థాయిలో నేరస్తులకు శిక్షలు పడలేదు. ఆనాడు దినపత్రికలు జరిగిన అన్యాయాన్ని పతాక శీర్షికలతో ప్రపంచానికి తెలియజేశాయి. ఇలా ఎంతోమంది కవులు, కళాకారులు, ఉద్యమ కారులు, సామాజికవేత్తలు, కారంచేడు ఘటనను తమ ఆట, పాటల ద్వారా ఈ సమాజానికి తెలియజేసి వారిలో ఆత్మస్థైర్యం నింపారు. కత్తి పద్మారావు, బొజ్జా తారకం, సలగల రాజశేఖర్, విక్టర్ సాంసన్, కోటి జేమ్స్ వంటి మేధావులు బాధితుల పక్షాన నిలుస్తూ 28 డిమాండ్లతో ఉద్యమం చేపట్టారు. ఆనాటి పోరాటాల నుంచి నిత్యం స్ఫూర్తి పొంది దేశంలోని దళితులందరూ ఏటా జూలై 17 వ తేదిన "కారం చేడు మృత వీరుల సంస్మరణ' దినంగా జరుపుతుంటారు. కారంచేడు ఉద్యమం దేశంలో అనేక చట్టాల రూపకల్పనకు ప్రేరణగా నిలిచింది. 1989 ఎస్సీ/ఎస్టీ ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్ యాక్టు (అత్యాచారాల నిరోధక చట్టం) రావడానికి కారణమైంది. 1991లో జరిగిన చుండూరు నరమేధం ఘటనలో ప్రత్యేక కోర్టును ఘటన జరిగిన ఊరిలోనే ఏర్పాటు చేయడం జరిగింది. అప్పటివరకు హరిజనులుగా, ఎస్సీలుగా పిలువబడుతున్న వారిని దళిత, బహుజన అనే చైతన్యవంతమైన పదాల్ని ప్రజలకి పరిచయం చేసింది కారంచేడు ఉద్యమం. దళితుల సంక్షేమ చట్టాల రూపకల్పనలో కారంచేడు ఘటన ప్రభుత్వాలకి ఒక రిఫరెన్సులా నేటికీ ఉపయోగపడుతుంది. ముఖ్యంగా ఆధిపత్య కులాలు దళితుల్ని ఆచితూచి మాట్లాడేలా మార్పు తీసుకొచ్చింది కారంచేడు ఉద్యమం. కారంచేడు, చుండూరు దళిత ఉద్యమాల ప్రభావంతోనే ఆనాటి కేంద్ర ప్రభుత్వం బి.ఆర్. అంబేద్కర్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా 1991లో ఆయనకు 'భారత రత్న' ను ప్రదానం చేసి పార్లమెంట్ సెంట్రల్ హాల్లో ఆయన చిత్రపటాన్ని ఆవిష్కరించింది. దీంతో కారంచేడు ఘటన చరిత్రలో ఒక మలుపు. కారంచేడు ఉద్యమ సమయంలో బాధితుల పక్షాన నిలిచి పునరావాసం కల్పించడంలో కీలకపాత్ర పోషించిన నాటి ప్రత్యేక ఐ.ఎ.ఎస్ అధికారి ఎస్.ఆర్. శంకరన్ సేవలకు గుర్తుగా ఆయన విగ్రహాన్ని కారంచేడు బాధిత గ్రామం, చీరాల, విజయనగర్ కాలనీలో ప్రతిష్ఠించుకున్నారు. దళితుల ఆత్మగౌరవ ఉద్యమాలకు, దళిత రాజ్యాధికార సాధనకు కారంచేడు మృతవీరులు అందించిన స్ఫూర్తితో దళిత బహుజన సమాజం ముందుకు నడవాలని ఆశిస్తూ మృతవీరులకు జోహార్లు అర్పిస్తున్నాను.



డాక్టర్ మున్నంగి నాగరాజు
(కారంచేడు బాధితుడు)
జాతీయ అధ్యక్షులు
మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి
(ఎం ఆర్ పి ఎస్ )
(కారంచేడు మారణహోమానికి
40 ఏళ్లు అయిన సందర్భంగా)
మొబైల్ నం : 9154229156

## అమెరికాలో కరోనా కొత్త వేరియంట్లు... పెరుగుతున్న కేసులు

- మొదటి పేజీ తరువాయి

వ్యాపిస్తోందని సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) వెల్లడించింది.ముఖ్యంగా ఫ్లోరిడా, టెక్సాస్, కాలిఫోర్నియా, ఒహియో వంటి రాష్ట్రాల్లో కేసుల సంఖ్య అధికంగా ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సీడీసీ నివేదిక ప్రకారం, ఎన్బీ.1.8.1 మరియు ఎక్స్ఎఫ్ జీ అనే కొత్త వేరియంట్లు ప్రస్తుతం అమెరికాలో వ్యాప్తిలో ఉన్నాయి. ఈ కొత్త వేరియంట్ల ప్రభావం వల్ల గొంతు నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, గుండె బరువుగా ఉండటం వంటి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఏమైనా అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే కరోనా పరీక్షలు చేయించుకోవాలని, తద్వారా వైరస్ వ్యాప్తిని నియంత్రించవచ్చని తెలిపారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, రద్దీ ప్రదేశాలకు వెళ్లినప్పుడు మాస్కులు ధరించాలని, సాధ్యమైనంత వరకు సామాజిక దూరాన్ని పాటించాలని అధికారులు కోరుతున్నారు. ఈ పరిణామాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరుతున్నారు

## సీఎంల సమావేశం సుహృద్భావ వాతావరణంలో జరిగింది

- మొదటి పేజీ తరువాయి

మీడియాతో మాట్లాడారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి పాల్గొన్న ఈ భేటీని ఇరు రాష్ట్రాల సంబంధాల్లో ఒక కీలక ఘట్టంగా అభివర్ణించారు.

మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ, స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు కొనసాగాయని తెలిపారు. కృష్ణా నది నిర్వహణ బోర్డు అమరావతిలో, గోదావరి నది నిర్వహణ బోర్డు హైదరాబాద్‌లోనే కొనసాగాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. రెండు రాష్ట్రాలు సమర్పించిన ప్రతిపాదనల్లోని సాంకేతిక అంశాలపై కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. ఈ సమావేశం రెండు

తెలుగు రాష్ట్రాల మధ్య దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జల సమస్యల పరిష్కారానికి ఒక శుభ పరిణామంగా భావిస్తున్నామని అన్నారు. ఇరు రాష్ట్రాల రైతులకు, ప్రజలకు లబ్ధి చేకూర్చే ఒప్పందానికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు వివరించారు.ఇక, బనకచర్ల ప్రాజెక్టుపై సోమవారం లోపు ఒక కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు.

## నాడు మీరేం చేశారు?... చర్చకు సిద్ధమా?: జగన్ కు నాదెండ్ల మనోహర్ సవాల్

- మొదటి పేజీ తరువాయి

తీవ్ర విమర్శలు గుప్పించారు. కానూరు సివిల్ సప్లై భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, జగన్ అవగాహన, బాధ్యత లేకుండా మాట్లాడుతూ అబద్ధాల ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. "రైతుల కోసం మీరు ఏం చేశారో చర్చకు సిద్ధమా?" అని ఆయన జగన్‌కు సవాల్ విసిరారు.

మంత్రి మనోహర్ మాట్లాడుతూ, జగన్ ప్రజల తీర్పును అర్థం చేసుకోవాలని, ప్రజలు ఐదేళ్లకు ఒకసారి అధికారం ఇస్తారని జగన్ మరిచిపోయారా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో గుంతలు కూడా పూడ్చలేకపోయిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మద్యపాన నిషేధం, అమ్మ ఒడి వంటి హామీలను జగన్ ఎందుకు అమలు చేయలేదని నిలదీశారు.

**రైతులకు మద్దతు**

జగన్ పాలనలో రైతులకు రూ.1674 కోట్ల ధాన్యం బకాయిలు ఎగ్గొట్టారని, గోదావరి జిల్లాలో క్రాఫ్ హాలిడే ప్రకటించి రైతులకు నరకం చూపించారని మంత్రి ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఖరీఫ్, రబీ సీజన్లలో రూ.12,857 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసిందని, ఇందులో రూ.12,000 కోట్లు 24 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేశామని వెల్లడించారు. కొంత ఆలస్యంతో రూ.1,000 కోట్లు 40 రోజుల్లో జమ చేశామన్నారు. జగన్ ఈ విషయంలో అవగాహన పెంచుకోవాలని, గూగుల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సమాచారం ద్వారా వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు.

**జగన్ పర్యటనలపై విమర్శలు**

జగన్ బెంగళూరు నుంచి పనిచేస్తూ, నెలకు ఒకసారి రాష్ట్రానికి వచ్చి పర్యటనల పేరుతో అలజడి సృష్టిస్తున్నారని మంత్రి ఆరోపించారు. చిత్తూరు జిల్లా పర్యటనలో రాజకీయ లబ్ధి కోసం సమాజంలో చీలిక తెచ్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. జగన్ పాలన ప్రజలకు నచ్చకే 11 సీట్లకు పరిమితమయ్యారని, ప్రజలు కూటమి ప్రభుత్వానికి భారీ మెజారిటీ ఇచ్చారని గుర్తు చేశారు.

**కూటమి ప్రభుత్వ విధానం**

పవిత్రమైన పంటను రోడ్డుపై వేసి ట్రాక్టర్లతో తొక్కించడం దారుణమని, అమరావతి, పోలవరం వంటి ఇరిగేషన్ ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వం ఎంత చేస్తుందో ప్రజలు చూస్తారని మంత్రి అన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ కాపాడటం, మంచి పాలన, సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. "అద్భుతమైన పాలనను కూటమి ప్రభుత్వం అందిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు.

**దీపం-2 పథకం: ఉచిత గ్యాస్ సిలిండర్లు**

కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేస్తోందని, ప్రజలు అధికారం ఇచ్చింది బటన్లు నొక్కడానికి కాదని మంత్రి స్పష్టం చేశారు. దీపం-2 పథకం కింద ప్రతి నాలుగు నెలలకు ఒకసారి, సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందిస్తున్నామన్నారు. ఈ పథకాన్ని 2024 అక్టోబర్ 31న దీపావళి రోజున సీఎం చంద్రబాబు శ్రీకాకుళం జిల్లాలో ప్రారంభించారు. మొదటి విడతలో 97 లక్షల మందికి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించగా, దీనికి రూ.846 కోట్లు ఖర్చు చేశామన్నారు. రెండో విడతలో 91.10 లక్షల మందికి రూ.712 కోట్లతో గ్యాస్ సిలిండర్లు అందించినట్లు తెలిపారు.

## 'పీఎం ధన్ ధాన్య కృషి యోజన'కు మంత్రివర్గం ఆమోదం

- మొదటి పేజీ తరువాయి

స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం, పంట కోత తర్వాత గ్రామస్థాయిల్లో దిగుబడులను నిల్వ చేయడానికి గోదాముల సదుపాయం, నీటి పారుదల సౌకర్యాలను మెరుగుపరచడం, రుణ లభ్యతను సులభతరం చేయడం వంటి లక్ష్యాలతో పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని రూపొందించారు. 11 శాఖల్లోని 36 పథకాలు, రాష్ట్రంలోని ఇతర పథకాలు, ప్రైవేటు రంగంతో స్థానిక భాగస్వామ్యం ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తారు.కేంద్ర మంత్రివర్గ సమావేశంలో మరికొన్ని నిర్ణయాలు కూడా తీసుకున్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో ఎన్టీపీసీకి రూ. 20 వేల కోట్ల పెట్టుబడులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అంతరిక్ష కేంద్రంలో 18 రోజులు గడిపి విజయవంతంగా భూమికి తిరిగి వచ్చిన శుభాంశు శుక్లాను అభినందిస్తూ తీర్మానం చేశారు.

## టెలీమెట్రీలకు ఆంధ్రప్రదేశ్ అంగీకరించింది

అన్ని రిజర్వాయర్లు, కాలువల వద్ద టెలీమెట్రీలను ఏర్పాటు చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగీకరించిందని తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, యుద్ధ ప్రాతిపదికన టెలీమెట్రీలను ఏర్పాటు చేస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలిపిందని ఆయన అన్నారు.కృష్ణా నదీ జలాల వినియోగం లెక్కలపై అనుమానాలు ఉన్నాయని ఆయన అన్నారు. టెలీమెట్రీలను ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరామని, కేంద్రం నిధులు ఇవ్వకపోయినా రాష్ట్ర ప్రభుత్వమే నిధులు కేటాయిస్తుందని ఆయన తెలిపారు. టెలీమెట్రీల ఏర్పాటుపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో టెలీమెట్రీలను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు.


## పిల్లలకు హిందీ కంటే ఇంగ్లీష్ నేర్చుకోవడం ముఖ్యం

- మొదటి పేజీ తరువాయి

తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో జగన్ మాట్లాడుతూ, "పేద పిల్లలకు పోటీతత్వాన్ని పెంపొందించేందుకు హిందీని ఒక భాషగా బోధించవచ్చు. అయితే, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంలో బోధన జరిగితే విద్యార్థులు గ్లోబల్ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుంది" అని అన్నారు. మాతృభాషను తప్పనిసరిగా మొదటి భాషగా ఉంచాలని, రెండవ భాషగా హిందీ లేదా ఇతర భాషలను ఎంచుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. జగన్ తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకుంటూ, తాను చదువుకున్న పాఠశాలలో హిందీని మొదటి భాషగా నేర్చుకున్నానని, అయినప్పటికీ ఇంగ్లీష్ విద్య ద్వారా విద్యార్థులు ఎక్కువ అవకాశాలను సాధించవచ్చని పేర్కొన్నారు. "ఇంగ్లీష్ మీడియం విద్యా వ్యవస్థ కొత్త మార్పుకు నాంది పలుకుతుంది. ఇది విద్యార్థులకు బంగారు బాట వేస్తుంది" అని ఆయన ఉద్ఘాటించారు. హిందీని బలవంతంగా రుద్దడాన్ని వ్యతిరేకిస్తూ ఎన్డీఏ యేతర పక్షాలు చేస్తున్న వాదనలను జగన్ సమర్థించారు. అయితే, భాషా వివాదంపై రాజకీయ రంగు పులుముకోవడం కంటే, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విద్యా విధానాన్ని రూపొందించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి, "ఇప్పటికైనా మేల్కొని, తప్పులను సరిదిద్దుకోవాలి" అన్నారు.

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

## కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్‌తో సీఎం చంద్రబాబు భేటీ



అనంతపురం పెన్ పవర్ జూలై 16 : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్‌తో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆర్థిక శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ సమావేశమయ్యారు. న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్‌తో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బుధవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నెలకొన్న సమస్యలు, ఆర్థిక సహాయం గురించి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రితో రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి సమగ్రంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామమోహన్ నాయుడు, తదితరులు ఉన్నారు.



## శ్రీరంగం నుండి తిరుమల శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పణ



**తిరుమల పెన్ పవర్ జూలై 16 :** ఆణివార ఆస్థానం పర్వదినం సందర్భంగా తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీరంగం శ్రీ రంగనాథస్వామి తరఫున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. బుధవారం ఉదయం శ్రీ బేడి ఆంజనేయ స్వామివారి ఆలయం పక్కన గల తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్‌స్వామి మఠంలో శ్రీవారి సారెకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడినుండి తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఈవో జె.శ్యామలరావు, తమిళనాడు దేవాదాయ శాఖ కార్యదర్శి శ్రీధరన్ కలిసి పట్టువస్త్రాలను మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా నాలుగు మాడ వీధుల ప్రదక్షిణగా ఆలయంలోకి తీసుకెళ్లారు. అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు దేవాదాయ శాఖ అదనపు కార్యదర్శి మణివాసగం, శ్రీరంగం ఆలయ జాయింట్ కమిషనర్ శివరామ్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సుందర బట్టర్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

మల్యాల.నందికొట్కూరు పెన్ పవర్ జూలై 16 : ఈనెల 17న నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మల్యాల గ్రామంలో హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం పంపింగ్ స్టేషన్ నందు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జలహారతి కార్యక్రమం నిర్వహించి నీటిని విడుదల చేయనున్న సందర్భంగా పర్యటనకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లను కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జేసి విష్ణు చరణ్ లతో కలిసి మల్యాల గ్రామంలోని హెలిపాడ్, నీటి పంపింగ్ స్టేషన్ జలహారతి నిర్వహించచే ప్రదేశం, సభాస్థలి మొదలగు ప్రాంతాలలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించి చేయాల్సిన ముందస్తు ఏర్పాట్లు, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.



అధికారులందరూ సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటించే ప్రదేశాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతాచర్యలు ఏర్పాటు చేయడంతో పాటు, ఉమ్మడి కర్నూలు జిల్లా నుండి ప్రజా ప్రతినిధులు ప్రజలు ముఖ్యమంత్రి పర్యటనకు విచ్చేయ తనున్న సందర్భంగా ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, వాహనాల పార్కింగ్ కొరకు అనువైన ప్రదేశాలను ఏర్పాటు చేసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ మరియు ఎస్పీ ఆదేశించారు. అనంతరం వివిధ అంశాలలో అధికారులతో సమీక్షించి తగు సూచనలు సలహాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, పోలీసు అధికారులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ పనులను వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి



**అనంతపురం , పెన్ పవర్ జూలై 16 :** రెవెన్యూ పెండింగ్ పనుల పై ప్రత్యేక దృష్టిని సారించి పూర్తిస్థాయిలో ఆయా పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్,వి. అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రెవెన్యూ సెక్టార్‌పై డిఆర్ఓ మలోలాతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా రిజిస్టర్, డీఎస్ఓ, తాసిల్దార్‌లో సిఎస్డిటిలు, నియోజకవర్గ మండల సర్వేయర్లు తదితరులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి భూసేకరణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఏపీ సేవలు, పౌరసరఫరా, రీ సర్వే, ఏపీఐఐసీ ఎంఎస్ ఎంఈ, ఎనర్జీ తదితర ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. మండల తాసిల్దార్‌లు పిజిఆర్ఎస్ అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. చాలా మంది తాసిల్దారులు క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యల పరిష్కారానికి మార్గాలు చూపవలసి ఉందని ఈ విషయంలో అలసత్వం ప్రదర్శించవద్దని గడువు లోపు అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. వెబ్ లాండింగ్ ప్రక్రియను ఆర్డీవోలు స్వయంగా పర్యవేక్షించాలని, పౌర సరఫరాలకు సంబంధించి వృద్ధులు వికలాంగులకు నెలాఖరులోపు ఇంటింటి రేషన్ పంపిణీ కచ్చితంగా జరగాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆర్డీవోలు, తాసిల్దార్‌లు, సీఎస్డిటిలు ఎఫ్.పి షాపును తనిఖీ చేయాలని అలాగే ఎమ్మెల్వో పాయింట్ల పర్యవేక్షణ జరగాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎస్ఓ నారాయణ, ఎస్.ఈ. ఏపీ ఎస్పీడీసీఎల్ శేషాద్రి శేఖర్, ఏపీఐఐసీ మేనేజర్ సాగర్ ఎస్డిసి తిప్పేనాయక్ కలెక్టరేట్ సూపర్డెంట్లు యోగేశ్వరిదేవి, రియాజుద్దీన్ పిజిఆర్ఎస్ తాసిల్దార్ వాణిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

## పనితీరు మెరుగుపరచుకోండి : ఇన్‌ఛార్జి కలెక్టర్, జెసి అదితి సింగ్



**కడప పెన్ పవర్ జులై 16 :** ప్రభుత్వ పథకాల అమలులో, అర్జీల పరిష్కారంలో క్రింది స్థాయి అధికారులు నిర్లక్ష్యం వీడి పనితీరు మెరుగుపరచుకొని, బాధ్యతా యుతంగా, జవాబుదారితనంతో పనిచేయాలని ఇన్చార్జి కలెక్టర్ మరియు జెసి అదితి సింగ్ అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని పి జి ఆర్ ఎస్ సమావేశ హాల్లో వీఆర్వోలు, సచివాలయ అడ్మిన్స్ వెల్ఫేర్ సెక్రటరీలు, మండల గ్రామ సర్వేయర్లతో ఐవీఆర్ఎస్ లో వచ్చిన ఫీడ్ బ్యాక్ నివేదికల పనితీరు పై డి.ఆర్.ఓ విశ్వేశ్వర నాయుడు తో కలసి ఇన్చార్జి కలెక్టర్ మరియు జెసి అదితి సింగ్ సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఇన్చార్జి కలెక్టర్ మరియు జెసి అదితి సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలలో వేగం, నాణ్యత, పారదర్శకత ముఖ్యమన్నారు. క్రింది స్థాయి అధికారులు పనితీరులో ప్రమాణాలు పెంచుకోవాలన్నారు. ప్రజలతో కలిసి మెలిసి మమేకం కావాలని, చట్ట ప్రకారం ప్రభుత్వ మార్గదర్శకాలు మేరకు పని చేయాలని సూచించారు. ఏలాంటి సమస్య అయినా కాలయాపన చేయకుండా వేగంగా స్పందించి చర్యలు చేపట్టి నాణ్యతగా పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తులకు త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సేవలు, పథకాలపై ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారా లేదా అనే అంశాలపై ఐవిఆర్ఎస్ ద్వారా( ఫీడ్ బ్యాక్) మనోభావాలను సేకరిస్తోందని తెలిపారు. ఇందులో ప్రధానంగా మూడు ప్రశ్నలు ఉన్నాయని అవి అధికారులు అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారా, అధికారులు నోటీసులు జారీ చేశారా, దరఖాస్తును పరిశీలించి ఫీల్డ్ విజిట్ చేశారా అన్న అంశాలపై ఇప్పటివరకు ఐవిఆర్ఎస్ ద్వారా సేకరించిన ఫీడ్ బ్యాక్ లలో పనితీరు మెరుగ్గా లేని వారిని గుర్తించి పిలవడం జరిగిందన్నారు.

ఇకపై క్రింది స్థాయి అధికారులు పనితీరును మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఐవిఆర్ఎస్ నివేదికలపై ముఖ్యమంత్రి కార్యాలయం, చీఫ్ సెక్రటరీ స్థాయిలో మోనిటరింగ్ ఉందని తెలిపారు. ప్రభుత్వ పథకాల అందజేత ,అర్జీలు పరిష్కారం చూపడంలో తీవ్ర జాప్యం చేయడం, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలను దృష్టిలో ఉంచుకొని క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పని చేయాలన్నారు అన్నారు. ఐవిఆర్ఎస్ ఫీడ్ బ్యాక్ నివేదికలలో పనితీరు మెరుగ్గా లేని అధికారులపై తహసిల్దార్లు విచారణ పూర్తి చేసి రిపోర్ట్ అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్వే ల్యాండ్ అధికారి మురళీకృష్ణ,మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్రమణ్యం, తహశీల్దార్లు, సర్వేయర్లు,వీఆర్వో లు, సచివాలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## చైల్డ్ రిజిస్ట్రేషన్ నమోదు.. ప్రతి బిడ్డకు వాక్సినేషన్

### - జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు, పెన్ పవర్ జూలై 16 :** మాతా శిశు సంరక్షణలో భాగంగా మెడికల్ ఆఫీసర్లు వారి పరిధిలో గల ఏఎన్ఎంలు,ఆశా వర్కర్లు బాధ్యతా యుతంగా పని చేసేలా మెడికల్ ఆఫీసర్లు నిరంతర పర్యవేక్షణ ఉండాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి ఆధ్వర్యంలో జిల్లాలోని వైద్యాధికారులతో మూడు మాతృ మరణాలపై కొలమాసనపల్లె, ఓగు, విజలాపురం పిహెచ్‌సిలలో జరిగిన మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌సిహెచ్ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీల నమోదు, వారికి ఇవ్వవలసిన సేవలు ఖచ్చితత్వంతో పూర్తి స్థాయిలో అందించిన ఎడల పూర్తి స్థాయిలో మాతా శిశు మరణాలు నివారించవచ్చునన్నారు. గర్భిణీ స్త్రీల నమోదులో ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా అంగన్వాడీ రిజిస్టర్‌లో సరి చూసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భవతులకు సరైన సమయంలో పోషకాహారం అందించడం ద్వారా రక్తహీనత సమస్యలను నివారించ వచ్చునన్నారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, గర్భిణీలలో రక్తహీనత సమస్య తలెత్తకుండా గర్భధారణ దాల్చిన సమయం నుండి డెలివరీ అయ్యేంత వరకు ఆ మహిళల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. దీనితోపాటు హై రిస్క్ గర్భవతుల పట్ల ఎప్పటి కప్పుడు వారి ఆరోగ్య స్థితి గతులు తెలుసుకొని అవసరమైన వైద్య సేవలు అందించాలన్నారు. హైరిస్క్ గర్భిణీ స్త్రీలకు రక్తహీనత లేకుండా ఎప్పటికప్పుడు బిపి, షుగర్, హైబిపి చెక్ చేస్తూ, అవసరమైతే సుక్రోస్ ఇంజక్షన్‌ను వేయించి రక్తహీనత లేకుండా పౌష్టికాహారం పై అవగాహన కల్పిస్తు సేవలు అందిస్తే రక్తహీనత లేకుండా చూడొచ్చని తెలిపారు. అంగన్వాడి నందు ఇచ్చే పౌష్టికాహారాన్ని తనిఖీ చేయాలన్నారు. భవిష్యత్తులో మాతృ మరణాలు జరగ కుండా జిల్లా స్థాయిలో మరియు ప్రాథమిక స్థాయిలో ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పుట్టిన ప్రతి బిడ్డను రిజిస్ట్రేషన్ చేయడం ద్వారా వారికి నిర్దేశించిన సమయంలో వాక్సినేషన్ వేసి పిల్లల ఆరోగ్య స్థితి గతులను ఎప్పటికప్పుడు చూసేందుకు అవకాశం ఉంటుందని ఈ విషయంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, బాధ్యతాయుతంగా పనిచేయడంలో మెడికల్ ఆఫీసర్లు కీలకపాత్ర పోషించాలన్నారు. గర్భిణీ స్త్రీల నమోదు, చిల్డ్రన్ రిజిస్ట్రేషన్ లో సంబంధించి ప్రతి పి హెచ్ సి పరిధిలో మెడికల్ ఆఫీసర్లు ఏఎన్ఎంలు ఆశా వర్కర్లతో తరచూ సమావేశాలు నిర్వహించి పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంతో ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్, డిఐఓ డాక్టర్ హనుమంతరావు, ప్రోగ్రాం అధికారులు, వైద్య అధికారులుపాల్గొన్నారు.


### నూతన శ్రీవాణి టికెట్ల జారీ కేంద్రంలో

# భక్తులకు మౌలిక సదుపాయాలు

### - టీటీడీ ఈవో జె.శ్యామలరావు



**తిరుమల పెన్ పవర్ జూలై 16 :** తిరుమలలోని అన్నమయ్య భవన్ కు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న శ్రీవాణి టికెట్ల జారీ కేంద్రంలో భక్తుల కోసం మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని టీటీడీ ఈవో జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుమలలో జూలై 22వ తేదిన భక్తులకు అందుబాటులోకి రానున్న నూతన శ్రీవాణి కేంద్రాన్ని అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి ఆయన బుధవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా కౌంటర్ వద్ద భక్తులు ఇబ్బంది పడకుండా టీ, కాఫీ, పాలు, తాగునీరు, పంపిణీ చేయాలని ఆదేశించారు. భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా క్యూలైన్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. శ్రీవాణి టికెట్ల సమాచారాన్ని భక్తులందరికీ తెలిసేలా డిజిటల్ స్క్రీన్ల ద్వారా తెలియజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఏఎన్‌సీ, హెచ్‌వీసీ ఉప విచారణ కార్యాలయాల వద్ద జరుగుతున్న ఆధునీకరణ పనులను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం తిరుమలలోని ఫుడ్&వాటర్ ల్యాబ్ ను తనిఖీ చేసి అక్కడ చేపడుతున్న పరీక్షల గురించి సిబ్బందితో ఆరా తీశారు. నాణ్యతలో రాజీ లేకుండా ఎప్పటికప్పుడు పగడ్బందీగా ఆహార, తాగునీటి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ సుబ్రమణ్యం, డిప్యూటీ ఈవోలు వెంకటయ్య, భాస్కర్, సోమన్నారాయణ, డీఈ చంద్రశేఖర్, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.





## అర్హులైన పేదలకు, చేనేతలకు ఇళ్ల స్థలం, ఇళ్లు ఇవ్వాలి

### - రెవెన్యూ అధికారులతో పరిటాల శ్రీరామ్ సమావేశం



**ధర్మవరం పెన్ పవర్ జూలై 16 :** ధర్మవరం నియోజకవర్గంలో అర్హులైన పేదలకు, చేనేతలకు ఇంటి స్థలంతో పాటు ఇళ్లు కూడా నిర్మించి ఇచ్చే బాధ్యత మనదేనని ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరంలోని రెవెన్యూ, మున్సిపల్, హౌసింగ్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సమావేశంలో డి.ఇ శంకర్ లాల్, ఏ.ఈ చిరంజీవి, మున్సిపల్ ఆర్.ఐ శివకుమార్, టిపిఓ అలివేలమ్మ, విజయ భాస్కర్, టిడ్కో ప్రతినిధి తిరుమని, రాజేష్, ఇన్ ఛార్జి తహసీల్దార్ సురేష్, వీఆర్వో రవి మండల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యంగా మంత్రి సత్యకుమార్ చేపట్టిన పాద యాత్రలో గత 15రోజులుగా తాను నిర్వహిస్తున్న సుపరి పాలన కార్యక్రమాల్లో వచ్చిన ఫిర్యాదులు, విజ్ఞప్తుల మీద చర్చించారు. ప్రధానంగా చాలా మంది ఇళ్ల పట్టాలు లేవని, ఇళ్ల మంజూరుకి సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా వచ్చాయని.. వీటిన్నింటినీ పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన పొరుపాట్ల వలన ప్రజలు నేటికీ ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో ఇచ్చిన పట్టాలు రద్దు చేయడం, కొత్తగా ఇచ్చిన వాటికి సంబంధించిన స్థలాలు చూపకపోవడం, పేదల ఇళ్ల స్థలాలతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం వంటివి ఎన్నో ఉన్నాయన్నారు. తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బేస్ లెవల్ వరకు పూర్తైన ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో మరోసారి పరిశీలించి అర్హత ఉన్న వారి జాబితాలను సిద్ధం చేయాలని శ్రీరామ్ సూచించారు.

## టీటీడీ బర్డ్ ట్రస్ట్‌కు రూ.10,01,116 విరాళం



**తిరుమల పెన్ పవర్ జూలై 16 :** క్యాంప్ కార్యాలయంలో చైర్మన్ బీఆర్ నాయుడుని కలిసి విరాళం చెక్కును అందజేసిన దాతలు ముప్పరాజు జగదీష్, కదూరు విజయలక్ష్మి. చైర్మన్‌తో పాటు ఉన్న బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు ఉన్నారు.

### హిట్ అండ్ రన్ కేసులలో పరిహారం చెల్లింపు అంశాలపై

## డిస్టిక్ లెవెల్ అధికారుల మానిటరింగ్ మీటింగ్



**కడప పెన్ పవర్ జూలై 16 :** డాక్టర్ సి.యామిని, చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప వారి సూచనల మేరకు సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు కడప కోర్టు కాంపౌండ్‌లో గల న్యాయ సేవా సదన్‌లో "హిట్ అండ్ రన్ కేసుల లో పరిహారము చెల్లింపు మొదలగు అంశాలపై డిస్టిక్ లెవెల్ అధికారుల మానిటరింగ్ మీటింగ్" నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడప రెవెన్యూ డివిజనల్ అధికారి, కడప మరియు రాయచోటి సబ్ డివిజనల్ పోలీస్ అధికారి, మదనపల్లి సబ్ కలెక్టర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమి ఆక్రమణ




**కడప పెన్ పవర్ జూలై 16 :** వై.యస్.ఆర్ కడప జిల్లా కలెక్టరు చెరుకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు, చింతకొమ్మదిన్నె మండలము, మామిళ్లపల్లె గ్రామంలోని సర్వే నెం.727, 738/1, 738/3 , 739/1, 740/1, 740/3 , 749 మరియు 748/2 నందలి ప్రభుత్వభూమి ఆక్రమణ విషయము గురించి ఎ.నాగేశ్వరరావు, తహసీల్దారు, చింతకొమ్మదిన్నె మండలము వారు మరియు కార్యాలయ సిబ్బంది వారు విచారించి, మామిళ్లపల్లె గ్రామం ఆర్ఎస్ఆర్ ప్రకారం సర్వే నెం.727 పూర్తి విస్తీర్ణం:308.18 ఎకరములుగా, 4 మరియు 5 కాలముల యందు "ప్రభుత్వ పోరంబోకు (జి.పి.) " గా, 16 వ కాలము నందు "చుక్కలు" నమోదై మరియు 17 వ కాలము నందు "కొండ" గా నమోదై ఉన్నదని, చింతకొమ్మదిన్నె మండలము, బుగ్గలపల్లె మజరా, నాగిరెడ్డిపల్లె గ్రామ నివాసి అయిన శ్రీ గుత్తిరెడ్డి ఆదినారాయణ రెడ్డి తండ్రి:శేషారెడ్డి, నాగిరెడ్డిపల్లె గ్రామము అనువారు మామిళ్లపల్లె గ్రామ పొలం సర్వే నెం.738/1 నందు విస్తీర్ణం:1.55 ఎకరములు, 738/3 నందు విస్తీర్ణం:2.68 ఎకరములు, 739/1 నందు విస్తీర్ణం: 3.16 ఎకరములు, 740/1 నందు విస్తీర్ణం:4.66 ఎకరములు, 740/3 నందు విస్తీర్ణం:0.02 ఎకరములు, 749 నందు విస్తీర్ణం: 9.31 ఎకరములు, 748/2 నందు విస్తీర్ణం:2.28 ఎకరములు మరియు 727 నందు విస్తీర్ణం: 4.75 ఎకరములు మొత్తం విస్తీర్ణం:29.46 ఎకరముల ప్రభుత్వభూమిని ఆక్రమించి మామిడి చెట్లు, జామ చెట్లు, దానిమ్మ చెట్లు మరియు నిమ్మ చెట్లు సాగు చేస్తున్నారని నిర్ధారించుకొని, శ్రీ గుత్తిరెడ్డి ఆదినారాయణ రెడ్డి గారికి ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణ చట్టం, 1905 సెక్షన్-7 ననుసరించి నోటీసులను జారీ చేయడమైనది. సదరు నోటీసుకు సంబంధించి గుత్తిరెడ్డి ఆదినారాయణ రెడ్డి నుంచి ఎటువంటి వ్రాతపూర్వక వివరణ కార్యాలయము నందు సమర్పించలేదు. పై నోటీసు నందు పేర్కొన్న గడువు తేది ముగిసిన పిదప, ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణ చట్టం, 1905 సెక్షన్-6 మేరకు 14.07.2025 వ తేదిన శ్రీ గుత్తిరెడ్డి ఆదినారాయణ రెడ్డి తండ్రి:శేషారెడ్డి వారిని పై సర్వే నెంబర్ల యందు ఆక్రమణలు తొలగించవలసినదిగా ఉత్తర్వులు జారీ చేసి, మామిళ్లపల్లె గ్రామ పొలం సర్వే నెం.738/1 నందు విస్తీర్ణం:1.55 ఎకరములు, 738/3 నందు విస్తీర్ణం:2.68 ఎకరములు, 739/1 నందు విస్తీర్ణం: 3.16 ఎకరములు, 740/1 నందు విస్తీర్ణం:4.66 ఎకరములు, 740/3 నందు విస్తీర్ణం:0.02 ఎకరములు, 749 నందు విస్తీర్ణం: 9.31 ఎకరములు, 748/2 నందు విస్తీర్ణం:2.28 ఎకరములు మరియు 727 నందు విస్తీర్ణం: 4.75 ఎకరములు మొత్తం విస్తీర్ణం:29.46 ఎకరముల ప్రభుత్వభూమిని నందు "హెచ్చరిక బోర్డు"లను ఏర్పాటు చేసి ప్రభుత్వభూమిని స్వాధీనము చేసుకున్నారు.

## ఖాజావలి మృతి బాధాకరం : గంగసాని



**పామూరు, పెన్ పవర్ జూలై16 :** పామూరులో నివాసం ఉంటున్న వెరీపాడు గ్రామస్థులు, వైసీపీ నాయకులు ఎర్ర ఖాజావలి మంగళ వారం మృతి చెందారు. బుధవారం మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి ఖాజావలి పార్థివ అధ్యాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు పట్టణ ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు రసూల్, మచ్చ బాషా, నాయబ్ రసూల్, షావుల్ నివాళులుఅర్పించిన వారిలో ఉన్నారు.

## శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా ఆణివార ఆస్థానం



**తిరుమల పెన్ పవర్ జూలై 16 :** తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం సాలకట్ల ఆణివార ఆస్థానం శాస్త్రోక్తంగా జరిగింది. తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్ నాయుడు, ఈవో జె.శ్యామలరావు పాల్గొన్నారు. ముందుగా ఉదయం 7 నుండి 9 గంటల వరకు బంగారు వాకిలి ముందు గల ఘంటా మండపంలో సర్వభూపాల వాహనంలో ఉభయ దేవేరులతో కూడిన శ్రీ మలయప్ప స్వామి వారు గరుత్మంతునికి అభిముఖంగా కొలువుకు వేంచేపు చేశారు. మరో పీఠంపై స్వామివారి సర్వ సైన్యాధ్యక్షుడైన శ్రీ విష్వక్సేనులవారు దక్షిణాభిముఖంగా వేంచేపు చేశారు. అనంతరం ఆనంద నిలయంలోని మూల విరాట్టుకు, బంగారు వాకిలి వద్ద ఆస్థానంలో వేంచేపు చేసిన ఉత్సవమూర్తులకు ప్రత్యేకపూజలు, ప్రసాదాలు నివేదించారు. అనంతరం శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి పెద్ద వెండితట్టలో ఆరు పెద్ద పట్టువస్త్రాలను తలపై పెట్టుకొని మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా విచ్చేశారు. శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఈవో, ఇతర ఉన్నతాధికారులు వెంట వచ్చారు. నాలుగు పట్టు వస్త్రాలను మూలవిరాట్టుకు అలంకరించారు. మిగిలిన రెండు వస్త్రాలలో ఒకటి మలయప్పస్వామి వారికి, మరొకటి విష్వక్సేనులవారికి అలంకరించారు. తదనంతరం శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు తమ తలకు శ్రీవారి పాద వస్త్రంతో "పరివట్టం"(చిన్న పట్టుగుడ్డ) కట్టుకొని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరించి 'నిత్యైశ్వర్యోభవ' అని స్వామివారిని ఆశీర్వదించారు. ఆ తరువాత అర్చకులు శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ గారికి, శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ గారికి, టీటీడీ తరపున ఈవోకి 'లచ్చన' అను తాళపు చెవి గుత్తిని వరుస క్రమంలో కుడిచేతికి తగిలించారు. "రూపాయి" హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేసిన అనంతరం ఆ తాళపు చెవి గుత్తిని శ్రీవారి పాదాల చెంత ఉంచడంతో ఆణివార ఆస్థానం ముగిసింది.

**వార్షిక లెక్కలు ప్రారంభించిన రోజు :** సాధారణంగా ప్రతి సంవత్సరం సౌరమానం ప్రకారం దక్షిణాయన పుణ్యకాలంలో కర్కాటక సంక్రాంతినాడు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. అయితే సౌరమానాన్ని అనుసరించే తమిళుల కాలమానం ప్రకారం ఆణిమాసం చివరి రోజున నిర్వహించే కొలువు కావడంతో ఆణివార ఆస్థానం అని పేరు వచ్చింది. పూర్వం మహంతులు దేవస్థాన పరిపాలనను స్వీకరించిన రోజు అయిన ఈ ఆణివార ఆస్థానం పర్వదినంనాటి నుండి టీటీడీ వారి ఆదాయ వ్యయాలు, నిల్వలు తదితర వార్షిక లెక్కలు ప్రారంభమయ్యేవి. టీటీడీ ధర్మకర్తల మండలి ఏర్పడిన తరువాత వార్షిక బడ్జెట్‌ను మార్చి-ఏప్రిల్ నెలలకు మార్చారు. సాయంత్రం పుష్పపల్లకీపై స్వామి, అమ్మవారు నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు శ్రీమతి పనబాక లక్ష్మి, భాను ప్రకాష్ రెడ్డి, నరేష్ కుమార్, శాంతా రామ్, సదాశివరావు, జంగా కృష్ణమూర్తి, జానకి దేవి, మహేందర్ రెడ్డి, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు న్యాయవిజ్ఞాన సదస్సు




**కడప పెన్ పవర్ జూలై 16 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా డాక్టర్ సి.యామిని, చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారి సూచనల మేరకు ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారు కడప బార్ అసోసియేషన్ హాల్ నందు "మధ్యవర్తిత్వంపై న్యాయవిజ్ఞాన సదస్సు:" నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యవర్తిత్వం యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు, మధ్యవర్తిత్వం అంటే ఒక మధ్య మతి తన నైపుణ్యంతో కక్ష దారుల సమస్యలను పరిష్కరించుకునే అవకాశాన్ని కల్పించే ప్రత్యేక ప్రక్రియ, మధ్యవర్తి కక్షిదారులకు తమ సమస్యలను తానే పరిష్కరించుకునే అవకాశాన్ని కల్పించే ప్రక్రియ, మధ్యవర్తి అంగీకార పత్రంలో షరతులను కచ్చిదారులకు వివరించి ఖరారు చేసి క్లుప్తంగా స్పష్టంగా సంపూర్ణంగా ఉండే ఒప్పంద పత్రాన్ని తయారు చేస్తారు, ఇది పూర్తిగా అంతరంగికమైన ప్రక్రియ ఇది పూర్తిగా స్వచ్ఛంద ప్రక్రియ దీనికి సంబంధించి నిర్దిష్టమైన ఆదేశిక నియమాలు అంటూ ఏమీ లేవు మొదలగు అంశాలను వివరించారు. అనంతరం మధ్యవర్తిత్వం సంబంధించిన కరపత్రాలను పంచిపెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో కడప బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీ రాఘవరెడ్డి, బార్ అసోసియేషన్ సెక్రటరీ చంద్రవదన, ప్యానల్ న్యాయవాదులు, న్యాయవాదులు, ఎన్జీవోలు, బసిరెడ్డి మరియు బసవతారక రామ లా కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలినేనిపాలెం గ్రామంలో జన సురక్ష కార్యక్రమం




**వలేటివారిపాలెం పెన్ పవర్ జూలై 16 :** బుధవారం ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ వలేటివారిపాలెం శాఖ వారు పోలినేనిపాలెం గ్రామంలో ప్రధాన మంత్రి జన సురక్ష కార్యక్రమం మేనేజర్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు ఆభరణాలపై 1 గ్రాముకు 6800 ఇస్తున్నట్లు చెప్పారు. 2025-06-30 నాటికి 65 కోట్ల వ్యాపారం ఆంధ్రప్రదేశ్ బ్యాంకు సాధించిందని తెలియజేశారు. మే నెల నుంచి ఆంధ్రప్రదేశ్ బ్యాంకు రాష్ట్ర వ్యాప్తంగా ఎనలేని సేవలను అందిస్తోందని జన సురక్ష కార్యక్రమం ద్వారా తెలిపారు. ఫీల్డ్ ఆఫీసర్ రవికుమార్ పిఎం జేజే బివై , పిఎంఎస్ బివై, ఏపీవై , పిఎం జెడివై , గురించి క్లుప్తంగా వివరించారు. అంతేకాకుండా మే నెల నుంచి ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ రాష్ట్ర వ్యాప్తంగా సేవలు అందిస్తున్న దన్నారు. బ్యాంక్ రుణాలు మరియూ డిపాజిట్ పథకాల మలు గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాపార ప్రతినిధి రత్న బాబు, గ్రామస్తులు మాదాల రమణయ్య, మానికొండ కొండయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి

## జిల్లా యంత్రాంగం కృషి చేయాలి

### - కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు, పెన్ పవర్ జూలై 16 :** జిల్లాలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి జిల్లా యంత్రాంగం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా సచివాలయం కలెక్టర్ చాంబర్ సమావేశపు మందిరం నందు ఉల్లాస్ పథకం అమలు, "అక్షర ఆంధ్ర" ప్రారంభం అంశాలపై ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పడేల్ తో కలిసి జిల్లాలో స్వచ్ఛంద ఉపాధ్యాయుల నియామకం మరియు తరగతుల నిర్వహణ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఉల్లాస్ అనే పథకాన్ని 2024 అక్టోబర్ నుండి రాష్ట్రంలోని అన్ని 26 జిల్లాల్లో అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. 2024-25 సంవత్సరంలో ఈ కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో సుమారు 40 వేల మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి అన్ని శాఖలు కలిసి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమం 2029 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 100% వయోజన ప్రాథమిక అక్షరాస్యత సాధించాలనే లక్ష్యంతో "అక్షర ఆంధ్ర" అనే ప్రత్యేక అక్షరాస్యత కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. ఈ కార్యక్రమం వికేంద్రీకృతం చేసిన, భాగస్వామ్యమైన మరియు సాంకేతిక ఆధారిత విధానాన్ని అనుసరించనుంది. ప్రతి సంవత్సరం 25 లక్షల మంది అభ్యాసకులను లక్ష్యంగా ఉంచి, ముఖ్యంగా మహిళలు, కూలీలు, మరియు 15-59 సంవత్సరాల వయోపరిమితిలో ఉన్న బలహీన వర్గాల (ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో సహా) పై దృష్టి పెట్టాలని తెలిపారు.

## పెదపల్ల పీహెచ్‌సీ వైద్యాధికారిణిగా భాగ్యశ్రీ



**ఆలమూరు, పెన్ పవర్,జూలై 16 :** ఆలమూరు మండలం పెద పల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వితీయ వైద్యాధికారిణిగా కె.భాగ్యశ్రీ నియమితు లయ్యారు. స్థానిక పీహెచ్‌సీ కార్యాలయంలో ప్రధాన వైద్యాధికారి డి.సాయి కిశోర్ సమక్షంలో బుధవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లా లోని బుట్టాయగూడెం మండలంలోని పులి రామన్న గూడెం వైద్యాధికారిణిగా రెండేళ్ల పాటు పనిచేసి బదిలీపై స్థానిక పీహెచ్ సీకి వచ్చారు. ఆస్పత్రికి ప్రస్తుత అవసరమైన ప్రసూతి సేవలకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి సుఖ ప్రసవాలు జరిపేందుకు కృషి చేస్తానని వైద్యాధికారిణి భాగ్యశ్రీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పీహెచ్ సీ ఏర్పడిన పుష్కరకాలంలో తొలి మహిళ వైద్యాధికారి భాగ్యశ్రీ కావడం గమన్హారం. కమ్యూనిటీ హెల్త్ ప్రతినిధులు ఎంఎస్ఎన్ రెడ్డి, ఏవివి రాజా, ముద్రగడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## నాన్‌లోనీ రైతులు ప్రీమియం చెల్లించండి

### - వ్యవసాయ శాఖ విజ్ఞప్తి

**కాజులూరు,పెన్ పవర్,జూలై 16 :** ఖరీఫ్ 2025 పంటల బీమా కోసం ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన కింద నాన్ లోనీ రైతులు (పంట రుణం తీసుకోని రైతులు) ప్రీమియం చెల్లించాల్సిన సమయం వచ్చిందని కాజులూరు మండల వ్యవసాయ శాఖ తెలిపింది. రైతులు తమ సమీపంలోని సీఎస్ సీ సెంటర్ లేదా మీసేవ కేంద్రాన్ని సంప్రదించి తగిన పత్రాలతో బీమా ప్రీమియాన్ని చెల్లించవలసిందిగా సూచించారు.జత చేయవలసిన పత్రాలు:1.ఆధార్ కార్డు2. పొలం పాస్ పుస్తకం 3. క్రాప్ జోన్ సర్టిఫికెట్ (ఆర్ . ఎస్.కె నందు పొందవచ్చు) 4. మొబైల్ ఫోన్& మొబైల్ నెంబర్ (ఓటీపీ ధృవీకరణ కోసం) 5.బ్యాంకు అకౌంట్ పుస్తకం


**ప్రీమియం దరఖాస్తు రుసుము :** వరి పంటకు ఎకరానికి రూ.770గా నిర్ణయించబడింది.రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని, పంటలకు భద్రత కల్పించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.

# మీ చేతులు అందంగా ఉన్నాయా?

## అందమైన చేతులు. సహాయం చేసే చేతులు : రామకృష్ణమరాజు మనోబంధు

**కడప పెన్ పవర్ జూలై 16 :** ఒకసారి కొంతమంది అందమైన, స్థితిమంతులైన మహిళలు నది ఒడ్డున ఒక పిక్నిక్ కు వచ్చి, ఆనందిస్తున్నారు. కాసేపటి తర్వాత, నదిలోని చల్లటి, స్వచ్ఛమైన నీటిలో తమ చేతులను, కాళ్ళను కడుకుంటూండగా, నీటిలో వారి ప్రతిబింబం కనిపించింది. నీటిలోని ప్రతిబింబాన్ని చూసుకుని తమ అందాలని వారే పొగుడుకోవటం మొదలుపెట్టారు. వాళ్ళలో ఒకావిడ, "చూడు, నా చేతులు ఎంత అందంగా ఉన్నాయో" అంది. మరో మహిళ తన చేతులు మరింత అందంగా ఉన్నాయని అంది. మూడో స్త్రీ కూడా అలాగే అంది. ఈ క్రమంలోనే వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

అప్పుడే వారు అటుగా వెళుతున్న ఒక వృద్ధ మహిళను చూశారు. ఆమె ఒక కర్ర సహాయంతో నడుస్తోంది, బట్టలు మురికిగా ఉన్నాయి. ఆమె బాగా అలసిపోయి, ఆకలిగా ఉన్నట్లుగా కనిపించింది. ఆ ధనవంతులలో ఒకామె, "ఈ వృద్ధురాలిని పిలిచి, ఎవరి చేతులు చాలా అందంగా ఉన్నాయో అడగండి" అని సలహా ఇచ్చింది. వారందరూ దీనికి అంగీకరించి, ఒకరు ఆ వృద్ధురాలిని పిలిచారు. ఆ ముసలావిడ దగ్గరికి రాగానే అందరూ ఆమెకు తమ చేతులు చూపించి, "ఎవరి చేతులు అందమైనవో చెప్పు ?" అని అడిగారు. ఆ వృద్ధురాలు, "నాకు చాలా ఆకలిగా, దాహంగా ఉంది, మొదట నాకు తినడానికి ఏదైనా ఇవ్వండి, అప్పుడు నేను మీకు సమాధానం చెప్పగలను", అని అంది. కానీ ఆ మహిళలు ఆమెకు ఆహారం ఇవ్వడానికి నిరాకరించి, అక్కడనుండి వెళ్ళిపోమన్నారు. కొంతదూరంలో ఒక నిరుపేద స్త్రీ కూర్చుని పని చేసుకుంటూ ఉంది. ఆమె ఇదంతా చూసింది. ఆ వృద్ధురాలి దగ్గరకు వెళ్లి, చేయి పట్టుకుని ఎంతో ప్రేమగా తను పనిచేస్తున్న చోటికి తీసుకొచ్చి, కూర్చోబెట్టింది. ఆ వృద్ధురాలి తలపై చేయి వేసి నిరుపేద మహిళ ఓదార్చింది. ఆ తర్వాత ఆమె చేతులు, కాళ్ళు కడిగి, తన స్వంత బట్టలతో వాటిని తుడిచింది. అప్పుడు ఆమె తాను తెచ్చుకున్న ఆహారం నుండి వృద్ధురాలికి తినడానికి కొంత ఇచ్చి, త్రాగడానికి నీరు ఇచ్చింది. వృద్ధురాలికి కొంచెం మెరుగ్గా అనిపించిన తర్వాత, ఆమె ధనవంతులైన ఆ స్త్రీల వద్దకు తిరిగి వెళ్లి, పేద స్త్రీ వైపు చూపిస్తూ, "ఆమెకు చాలా అందమైన చేతులు ఉన్నాయి..." ఆడవాళ్ళంతా నవ్వుతూ "అందం గురించి నీకేం తెలుసు. అందం అంటే ఏమిటో కూడా నీకు తెలియదు!" అన్నారు హేళనగా. దానికి ఆ వృద్ధురాలు ఇలా బదులిచ్చింది, " మంచి పనులు చేసేవారికి, పేదలకు సేవ చేసేవారికి మాత్రమే అందమైన చేతులు ఉంటాయి. మంచి పనులతో చేతుల అందం పెరుగుతుంది కానీ, నగలతో కాదు.." మన చుట్టూ చాలా మంది ప్రజలు ఇబ్బందులు పడుతూ ఉంటారు. వారికి సహాయం చేయడం, సేవ చేయడం సర్వ మానవాళికి సేవ చేయడానికి లభించిన ఒక అవకాశంగా భావించాలి. ప్రార్థన సహాయపడుతుంది, కానీ అది చివరి ప్రయత్నం అయ్యి ఉండాలి. ఎక్కడైనా, ఎప్పుడైనా సాధ్యమైనంతగా, మన సహాయాలను, సేవలను విస్తరింపజేద్దాం.












**దాజీజి**
**హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం**
**అనువాదబృందం ఆంధ్రప్రదేశ్**



# "మధ్యవర్తిత్వంపై వన్ కే వాక్"




**కడప పెన్ పవర్ జూలై 16 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా డాక్టర్ సి.యామిని, చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారు "మధ్యవర్తిత్వంపై వన్ కే వాక్:" కడప న్యాయ సేవా సదన్ నుండి అంబేద్కర్ సర్కిల్ కూడలి వరకు తిరిగి అంబేద్కర్ సర్కిల్ కూడలి నుండి న్యాయ సేవా సదన్ కడప వరకు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యవర్తిత్వం యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు, మధ్యవర్తిత్వం అంటే నైపుణ్యంతో కక్షిదారుల సమస్యలను పరిష్కరించుకునే అవకాశాన్ని కల్పించే ప్రత్యేక ప్రక్రియ, మధ్యవర్తి కక్షిదారులకు తమ సమస్యలను తానే పరిష్కరించుకునే అవకాశాన్ని కల్పించే ప్రక్రియ, మధ్యవర్తి అంగీకార పత్రంలో షరతులను కచ్చిదారులకు వివరించి ఖరారు చేసి క్లుప్తంగా స్పష్టంగా సంపూర్ణంగా ఉండే ఒప్పంద పత్రాన్ని తయారుచేస్తారు, ఇది పూర్తిగా ఆంతరంగిక మైన ప్రక్రియ, ఇది పూర్తిగా స్వచ్ఛంద ప్రక్రియ దీనికి సంబంధించి నిర్దిష్టమైన ఆదేశిక నియమాలు అంటూ ఏమీ లేవు, సంవత్సరం పొడవునా చేసుకునే ప్రక్రియ, మొదలగు అంశాలను వివరించారు. మధ్యవర్తిత్వంపై వన్ కే వాక్‌లో నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి గరికపాటి దీన బాబు, గౌరవ ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీమతి యెన్.శాంతి, గౌరవ ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.రమేష్ కుమార్, గౌరవ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్.బాబా ఫక్రుద్దీన్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి జి.సి.ఆసిఫా సుల్తానా, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కే.భార్గవి, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.ఈశ్వర్ వెంకటప్రసాద్, మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.విజయలక్ష్మి, కడప బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాఘవరెడ్డి, బార్ అసోసియేషన్ సెక్రెటరీ చంద్రవదన, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ హరిబాబు, ప్యానల్ న్యాయవాదులు, మధ్యవర్తిత్వ న్యాయ వాదులు, పార లీగల్ వాలంటరీలు, ఎన్జీవోలు, బసిరెడ్డి మరియు బసవ రామ తారక లా కళాశాల విద్యార్థిని విద్యార్థులు, ప్రొఫెసర్లు మరియు ప్రజలు పాల్గొన్నారు.




## పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు

# పటిష్ట చర్యలు తప్పనిసరి

### జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్



**నంద్యాల, పెన్ పవర్, జూలై, 16 :** పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకొని వాటి నివారణకు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిక్ట్ క్రైసిస్ గ్రూప్ సమావేశాన్ని జిల్లా రెవెన్యూ అధికారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు పరిశ్రమల యాజమాన్యాలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా రెవెన్యూ అధికారి పరిశ్రమల యాజమాన్యాలను ఆదేశించారు. అందుకు ముందుగా డిస్ట్రిక్ట్ ఆఫ్ సైట్ ఎమర్జెన్సీ ప్లాన్ ను సిద్దంగా ఉంచుకోవాలన్నారు. అదే విధంగా పరిశ్రమల్లో మాక్ డ్రిల్స్ నిర్వహించినప్పుడు సంబంధిత అధికారులను అందరూ పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని డిఆర్‌ఓను జిఎం ను ఆదేశించారు. అదే విధంగా పిహెచ్సిల పరిధిలో ఎటువంటి పరిశ్రమలు ఉన్నాయి, అందులో ఏ విధమైన రసాయనాలు తయారు చేస్తారు అనే దానిపై వైద్య సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. పరిశ్రమల్లో కాలం చెల్లిన అగ్నిమాపక పరికరాలను వినియోగించకుండా ఎప్పటికపుడు వాటిని పరిశీలిస్తూ ఉండాలన్నారు. అదే విధంగా ఏవైనా ప్రమాదాలు జరిగినప్పుడు ఆటో అలారం, వర్క్ పర్మిట్ సిస్టమ్ తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని ఏవైనా అనుకొని సంఘటనలు జరిగినప్పుడు బాధితులకు జరిగిన నష్టాన్ని భర్తీ చేయలేదని అలా జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిశ్రమల శాఖ డిప్యూటీ ఇన్స్పెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పరిశ్రమల నియమ నిబంధనల మేరకు ఎన్ని నిర్వహిస్తున్నారు, అందులో పాటిస్తున్న భద్రతా ప్రమాణాల గురించి పూర్తి స్థాయిలో వివరించారు. అదే విధంగా జిల్లాలో ఉన్న పరిశ్రమల చుట్టూ ఉన్న పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు భద్రతా ప్రమాణాలపై అగ్నిమాపక సిబ్బంది సహకారంతో వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. అనంతరం ప్రమాద నివారణలో భాగంగా అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖ అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిషోర్ రెడ్డి, జిల్లా విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖ, ఎస్డిఆర్‌ఎఫ్ సిబ్బంది, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

## చట్టాన్ని గౌరవించండి...

## చట్ట రక్షణ మీకే అండ : డిఎస్పి చెంచుబాబు





**దొరవారి సత్రం, పెన్ పవర్, జూలై 16 :** ప్రజలు చట్టాలను గౌరవించి, పోలీసులకు సహకరిస్తేనే సమాజంలో శాంతి, భద్రత నిలబడుతుంది. యువత డ్రగ్స్ వాడకానికి దూరంగా ఉండాలి. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి. తప్పు చేసినవాడు ఎంత తెలివిగా దాచుకున్నా, చట్టం నుండి తప్పించుకోలేడు," అని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు స్పష్టం చేశారు . బుధవారం దొరవారిసత్రం మండలంలోని కల్లూరు గ్రామంలో నాయుడుపేట రూరల్ సిఐ సంగమేశ్వరరావు అధ్వర్యంలో దొరవారిసత్రం ఎస్సై అజయ్ కుమార్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చట్టాలపై అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొనారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు, యువతకు చట్టపరమైన విషయాలను అత్యంత స్పష్టంగా వివరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ చెంచుబాబు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల వెనుక ఉన్న ప్రధాన కారణం వేగం, నిర్లక్ష్యం, మద్యం సేవించి వాహనాలు నడపడం, దానితోపాటు ప్రతి వ్యక్తి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రాణాలు కాపాడవచ్చు. అలాగే నేటి యువతను భయంకరంగా ముంచేస్తున్న డ్రగ్స్‌కు బానిస కాకుండా ముందే జాగ్రత్త పడాలి. ఒకసారి బానిసైతే నాశనం ఖాయం," అని పేర్కొన్నారు. సైబర్ మోసాలకు టెక్నాలజీ సాయం చేస్తున్నా, ప్రజలు అప్రమత్తంగా ఉంటే మోసాలెక్కువ కాలవు. అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్, బ్యాంకింగ్ డేటా ఎవరితోనూ పంచుకోకూడదు," అని సూచించారు. యువత చట్టం గురించి తెలుసుకోవడం అత్యవసరం. అంతే కాకుండా 18 సంవత్సరాల కన్నా వయస్సు తక్కువ ఉన్న యువతితో ప్రేమ లాంటి వ్యవహారాలు చేస్తే సదరు బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదులు చేస్తే అబ్బాయిల జీవితం నాశనం అయిపోతుందని ఈ చట్టం గురించి పూర్తిగా యువకులు అవగాహన కలిగి ఉండాలని ఆయన తెలిపారు. అంతేకాకుండా తమ పిల్లలు ఎటువంటి మార్గంలో ఉన్నారు వాళ్ళు ప్రవర్తన పై అనునిత్యం నిఘా ఉంచుతూ పిల్లలు భవిష్యత్తు కొరకు వాళ్ళని సక్రమమైన మార్గంలో తీసుకుని వెళ్లడంలో తల్లిదండ్రులు ముఖ్యపాత్ర పోషించాలని ఆయన తెలిపారు. తల్లిదండ్రులు ఎంత ఆస్తి సంపాదించిన పిల్లలు సక్రమమైన మార్గంలో వెళ్లకపోతే పూర్తిగా వృధా అని పిల్లలపై ఎల్లప్పుడూ పర్యవేక్షణ అవసరమని ఆయన తల్లిదండ్రులకు సూచించారు. ఈ రోజు ఈ కార్యక్రమం చట్టాలపై అవగాహన కలిగించడమే ముఖ్య ఉద్దేశ్యం, అని తెలిపారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులకు పెన్ను, పుస్తకం, ప్యాడ్ డిఎస్పి చెంచుబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సదస్సుకు గ్రామస్థులు, విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై చక్కటి స్పందననిచ్చారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ సంగమేశ్వరరావు, దొరవారిసత్రం ఎస్ఐ అజయ్ కుమార్ పోలీస్ సిబ్బంది, మాజి ఎంపిపి ఇట్టగుంట రత్నయ్య, టిడిపి నాయకులు మల్లెయ్య, కల్లూరుకండ్రిగ టిటిపి నాయకుడు డేగ ప్రసాద్, పూలతోట తెలుగుదేశం సీనియర్ నాయకులు గణపర్తి ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి భారతీయ పౌరునికి ఆధార్ తప్పనిసరి

### - జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు, పెన్ పవర్ జూలై 16 :** పకడ్బందీగా ఆధార్ నమోదు ప్రక్రియను చేపట్టండి అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు ఆధార్ నమోదు ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూప్రతి భారతీయ పౌరునికి ఆధార్ తప్పనిసరి అని, ఆధార్‌తో చాలా అంశాలు ముడిపడి ఉన్నాయని, సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికకు ఆధార్ అనుసంధానంగా ఉందని, ఆధార్ నమోదులో పొరపాట్లకు తావులేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. 2011 నుండి ఆధార్ నమోదు నిరంతర ప్రక్రియగా కొనసాగుతున్నదన్నారు. జిల్లాల ప్రత్యేకంగా కుప్పం, నగిరి నియోజకవర్గాలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని తెలిపారు, వైద్య, విద్య, ఐసిడిఎస్, గ్రామ, వార్డు సచివాలయాల శాఖల సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు, రాష్ట్ర స్థాయిలో మన జిల్లా 58 శాతం ఉన్నదని 0-5 సంవత్సరాల పిల్లలు, మూడు సంవత్సరాల నుండి ఆరు సంవత్సరాల వరకు అంగన్వాడి కేంద్రాలలో ఉండే పిల్లలు నమోదు అయినారా లేరా పరిశీలించాలని ఐసిడిసి అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ నెల నాటికి జిల్లాలో ఆధార్ నమోదు వంద శాతం ఉండాలి, బర్త్ సర్టిఫికెట్ జారీ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు త్వరలో సంబంధిత ఆర్డీవోలు, ఎమ్మార్వోలు, మున్సిపాలిటీ కమిషనర్లతో ప్రత్యేక సమీక్షసమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో మొత్తం 226 ఆధార్ నమోదు కేంద్రాలు ఉన్నాయని, అందులో 117 గ్రామ/వార్డు సచివాలయాలు, 7 ఈ - సేవా సెంటర్ లు, 9 పోస్ట్ ఆఫీసులు, 9 బి ఎస్ ఎన్ ఎల్ ఆఫీసు లు, 14 బ్యాంక్ లు, 34 వైద్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయ ద్వారా ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్ డేషన్ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందన్నారు. బయోమెట్రిక్ అప్ డేషన్ నిరంతర ప్రక్రియగా ఉందని 0-5 ,3-7 సం.ల మధ్య వయసులో ఒకసారి, 15-17 సం.ల వయసు మధ్యలో మరోసారి ఆధార్ అప్ డేషన్ తప్పనిసరి అన్నారు. చిత్తూరు జిల్లాలో 0-5 ఏళ్ల పిల్లల జనాభా (2024 అంచనా) 1,53,047 జూన్ 5, 2025 నాటికి చిత్తూరులో జారీ చేసిన ఆధార్‌లు ఎ 89,179 (58%)

ప్రతి మండలంలో క్రియాశీలమైన GVWV & VSVS కిట్లతో కూడిన ఆధార్ సేవలు అందుబాటులో ఉండేలా చూడటం, అలాగే కేవలం GSWS ఆధ్వర్యంలో ఆధార్ సేవలు నిర్వహించే ఉపజిల్లాల్లో కనీసం ఒక రిజిస్ట్రార్ ద్వారా అదనపు కిట్‌లను ఏర్పాటు చేయాలి. ప్రతి నెల అన్ని పాఠశాలలు మరియు అంగన్‌వాడీల్లో MBU (Mandatory Bio Update) మరియు పిల్లల నమోదు శిబిరాలు నిర్వహించాలి. IPPB, ఆరోగ్య శాఖ ట్యాబ్‌ల ద్వారా ఇంటి వద్దకే మొబైల్ ఆధార్ అప్డేషన్ డ్రైవ్‌లు / శిబిరాలు నిర్వహించడం. 5-15 ఏళ్ల వయస్సు కలిగిన వారు ఇంకా ఆధార్ అప్డేట్ చేయని వారు మరియు నమోదు కాని పిల్లలను సమీప ఆధార్ కేంద్రాలకు లేదా GVWV & VSVS నిర్వహిస్తున్న శిబిరాలకు తీసుకురావడానికి సచివాలయాలను మోటివేట్ చేయాలి "యూనివర్సల్ క్లయింట్" ఫంక్షనాలిటీ కోసం జూలై 2024లో విడుదల చేసిన స్పెసిఫికేషన్‌కు అనుగుణంగా ECMP కిట్‌లను అప్గ్రేడ్ చేయడం.

L1 పరికరం / RD Active L0 పరికరం తక్షణ కొనుగోలు, ఇది ఆపరేటర్ సింక్ మరియు ECMP క్లయింట్‌లో డిస్పోజర్ కోసం అవసరం (192 వెర్షన్ నుండి తప్పనిసరి) పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిఎల్డిఓ రవి కుమార్, ఐసిడిఎస్ పిడి వెంకటేశ్వరి, డీఎంహెచ్వో, డీఈవో, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడపరాదు

### - ఎస్సై శివ నాంచారయ్య



**గిద్దలూరు పెన్ పవర్ జులై 16 :** గిద్దలూరు అర్బన్ సీఐ కె సురేష్ ఆదేశాల మేరకు గిద్దలూరు పట్టణంలో ఎస్సై శివ నాంచారయ్య వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక లోడుతో వెళ్తున్న వాహనాలు, మద్యం సేవించి ద్విచక్ర వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి జరిమానాలు విధించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు వాహనానికి సంబంధించిన సరైన పత్రాలను, లైసెన్సులను కలిగి ఉండాలని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వలన రోడ్డు ప్రమాదాలకు గురవుతారని ఫలితంగా కుటుంబాలు వీధిన పడతాయని తెలియజేశారు. అందుకే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్సై శివ నాంచారయ్య తెలియజేస్తున్నారు.

# టెక్నాలజీ పోలీసులు అందిపుచ్చుకోవాలి

### జిల్లాలోని పోలీస్ స్టేషన్లకు ఆధునిక కంప్యూటర్లు - జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్



**ఒంగోలు, పెన్ పవర్ జూలై 16 :** పోలీసులు మారుతున్న టెక్నాలజీ కి అనుగుణంగా అప్డేట్ అవ్వాలని జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ తెలిపారు. బుధవారం పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ పోలీస్ స్టేషన్ అధికారులకు ఆల్-ఇన్-వన్ కంప్యూటర్లు, వెబ్ కెమెరాలు, ప్రింటర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,ప్రతి పోలీస్ స్టేషన్‌లో టెక్నాలజీ వినియోగం పెంచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని, సీసీటీఎన్ఎస్ వ్యవస్థను మరింత సమర్థంగా నిర్వహించేందుకు అవసరమైన ఆధునిక కంప్యూటర్లు, కెమెరాలు, ప్రింటర్లు అందించబడ్డాయన్నారు. ఈ కొత్త ఆల్-ఇన్-వన్ కంప్యూటర్లు సీసీటీఎన్ఎస్‌కు అనుకూలంగా రూపొందించబడి, కేసు నమోదు నుండి దర్యాప్తు, విచారణ, న్యాయ ప్రక్రియ కేసు ఫైనల్ డిస్పోజల్ వరకు సాగే ప్రతి దశను డిజిటల్‌గా ప్రాసెస్ చేసేలా తయారు చేయబడ్డాయి. వీటిలో సీసీటీఎన్ఎస్ కు అవసరమైన అన్ని అప్లికేషన్లు ముందుగానే ఇన్‌స్టాల్ చేయబడి ఉంటాయన్నారు. జిల్లాకు పంపిణీ చేసిన పరికరాలు ఆల్-ఇన్-వన్ కంప్యూటర్లు 176,వెబ్ కెమెరాలు 44, ప్రింటర్లు 48, అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ రమణ కుమార్, ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, ఐటి కోర్ ఇన్స్పెక్టర్ సూర్యనారాయణ, సీఐలు సుధాకర్, నాగరాజు, శ్రీనివాసరావు, విజయకృష్ణ, యన్. శ్రీకాంత్, హాజరత్తయ్య, డీటీసీ ఇన్స్పెక్టర్ షమీముల్లా, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పాండు రంగారావు, ఆర్ఐ లు సీతారామిరెడ్డి, రమణారెడ్డి ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేటి నుండి సమ్మెలోకి కార్మికులు




**కావలి: పెన్ పవర్- (ఆర్సి ఇంచార్జ్ ) జులై 16 :** రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సి.ఐ.టి.యు. ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు నేటి నుండి సమ్మెలోకి వెళుతున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించిన సమ్మె నోటీసును బుధవారం మున్సిపల్ కమిషనర్ జి శ్రావణ్ కుమార్ కి అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియూ పట్టణ కార్యదర్శి వై. కృష్ణమోహన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు, ఇంజనీరింగ్. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, అనేక దఫాలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన పరిష్కారం కాకపోవడంతో మున్సిపల్ కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికులు బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి కమిషనర్ శ్రావణ కుమార్,కి వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. మున్సిప ల్ కార్మికులను ప్రైవేటు ఏజెన్సీల కి అప్పగించే ఆలోచన మానుకోవాలని, మునిసిపల్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని, వయస్సు పరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని ఎక్స్గ్రేషియా పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను కొనసాగించాలని అంతేకాకుండా ఇంజనీరింగ్ కార్మికులకు చట్టబద్ధ మైన సెలవులు గ్రాజువల్ లీవులు జాతీయ పండుగ సెలవులు అమలు చేయాలని కోరారు. ఆప్కాస్ లో చేర్చకుండా మిగిలిపోయిన ఇంజనీరింగ్ కార్మికులు, ఏళ్ల తరబడి పని చేస్తున్న కోవిడ్ కార్మికులను ఆప్కాస్ లో చేర్చాలని జీవో నెంబర్ 36 ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని మరికొన్ని డిమాండ్ల పరిష్కారం కొరకు మునిసిపల్ కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికులు నేటి నుండి సమ్మెలోకి వెళుతున్నట్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య జి. మధుసూదన్ రావు యూనియన్ నాయకులు తురకా శినయ్య, బి మహేష్, ఒంగోలు రమేష్, జలదంకి సీనయ్య ఇంజనీరింగ్ కార్మికులు ఏపూరి ఏసుదాసు, దావులూరి శ్రీనివాసులు, శెట్టిపల్లి ప్రభాకర్, పుల్లయ్య తో పాటు మున్సిపల్ కార్మికులు ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

## అమరావతిలో పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ స్థలం

## కేటాయించడంపై హర్షం : కాళ్లకూరి గోపికృష్ణ



**అమలాపురం పెన్ పవర్ జూలై 16 :** కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అమరావతిలో 6.8 ఎకరాలు కేటాయించడం జరిగింది. ఈ స్థలంలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆయన స్మృతి వనాన్ని ఏర్పాటు చేస్తారు. ఈ స్మృతి వనం ఏర్పాటు చేయడంపై ఆంధ్ర రాష్ట్ర వైశ్యు లందరూ కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటారని, ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు ఆత్మకు శాంతి చేకూరుతుందని వైశ్యులందరూ ఆశిస్తున్నారు.. అమరావతిలో 6.8 ఎకరాలు కేటాయించడంపై కూటమి ప్రభుత్వ సారథి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలుపుత తెలుపుతున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# సచివాలయ సిబ్బంది కర్తవ్య నిర్వహణ శ్రద్ధ చూపాలి





**పుల్లల చెరువు పెన్ పవర్ జూలై 16 :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మార్కాపురం డీల్ డీఓ బాలు నాయక్ పుల్లల చెరువు మండలాన్ని తనిఖీ చేశారు. పుల్లల చెరువు-2 సచివాలయాన్ని తనిఖీ చేసి, సిబ్బంది విధి నిర్వహణ, రికార్డు నిర్వహణ, ప్రజాసేవా పనితీరును సమీక్షించారు. సచివాలయ సిబ్బంది పనితీరు తగిన స్థాయిలో లేనందుకు ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాలు నాయక్ మాట్లాడుతూ ప్రజలకు అందించే సేవల ప్రాధాన్యతను అవగాహన చేసుకొని క్రమశిక్షణ, సమయ పాలన, బాధ్యతతో పనిచేయాలని, ప్రభుత్వం చేపట్టే సర్వేలను సమగ్రంగా పూర్తిచేయాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతిస్పందనాత్మకంగా వ్యవహరించడం అవసరమని సూచించారు. అనంతరం ఎస్ డబ్ల్యూపీసీ షెడ్‌ను పరిశీలించిన డీఎల్ డీఓ బాలు నాయక్. పంచాయతీ కార్యదర్శికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రోజు డోర్ టు డోర్ చెత్త సేకరణ నిరంతరం చేపట్టాలని, గ్రామ పారిశుధ్య నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అనంతరం మండల కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆయన సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు, సంక్షేమ కార్యక్రమాలను సమర్ధవంతంగా అమలు చేయడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం సచివాలయ సిబ్బందికి ప్రధాన బాధ్యత అని వివరించారు. అధికారులు ఇచ్చిన సూచనలను కచ్చితంగా అమలు చేసి, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ పిఓఆర్డి ఎన్ ఆత్మ, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

# నెల్లిపాకలో డ్రైనేజ్ పూడిక పనులు



**ఎటపాక, పెన్ పవర్, జూలై 16 :** అల్లూరి సీతారాముల జిల్లా ఎటపాక మండల పరిధిలోని నెల్లిపాక గ్రామంలో మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రైనేజీ పూర్తిగా మట్టితో పూడిపోవడంతో డ్రైనేజీ పూడిక పనులను మున్సిపాలిటీ సిబ్బందితో గత పది రోజుల నుంచి పూడిక పనులను చేపడుతున్నారు, సుమారు నాలుగు ఐదు సంవత్సరాల నుంచి డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమవడంతో డ్రైనేజీలో మట్టి పేరుకు పోయి మురుకు నీరు సరిగా పోక రోడ్డు పైకి వచ్చి మురికి నీరు చేరుతుంది, వర్షాకాలం వచ్చిందంటే మురికి నీరు రోడ్డుపైకి వచ్చి ఉండడంతో అటుగా వెళ్లే వారికి దుర్వాసన రావడంతో అనేక ఆరోగ్య సమస్యలు వచ్చేయని అందువలన పంచాయతీ అధికారులు డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా క్లీన్ చేయాలని పనులు మొదలుపెట్టారు.

## ప్రభుత్వ వైద్యం ముద్దు.. ఆర్ఎంపీ డాక్టర్ల వైద్యం వద్దు..

### ఇకనైనా మేలుకోండి ప్రజలారా ఉంటున్న డాక్టర్లు



**ఎటపాక, పెన్ పవర్, జూలై 16 :** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్ పరిధిలోని చింతూరు, విఆర్. పురం, కూనవరం,ఎటపాక మండలాలలో ఎటువంటి అనుభవం తర్ఫీదు గాని లేని ఆర్ఎంపీ డాక్టర్ల వద్దకు వెళ్ళి వైద్యం చేపించుకోవద్దని డిప్యూటీ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పుల్లయ్య అన్నారు,రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య విషయంలో చాలా నాణ్యతమైన ప్రమాణాలతో హాస్పిటల్స్ నిర్మించి తర్ఫీదు పొందిన క్వాలిఫైడ్ డాక్టర్లతో మెరుగైన వైద్యాన్ని అందిస్తుందని అన్నారు,ఇటీవల కొంతమంది ఆర్ఎంపీ డాక్టర్లు ప్రాథమిక వైద్యం చేసి చేతులెత్తేస్తున్న ఘటనలు మన మండలాలలో వెలుగులోకి వస్తున్నాయి, ఆర్ఎంపీ డాక్టర్లు గ్రామాలలో తిరుగుతూ పరిమితికి మించి వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు, కాసులకు కక్కుర్తి పడి వచ్చి రాని వైద్యం చేసి ప్రజల ప్రాణాలను గాలిలో కలుపుతున్నారు,ఇకనైనా ప్రజల మేలుకొని ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యం (చికిత్స) చేపించుకోవాలని డాక్టర్ పుల్లారావు అన్నారు.

## టిబి వ్యాధిగ్రస్తులకు అండగా నిక్షయ్ మిత్రలుగా చేరండి




**గోకవరం, పెన్ పవర్, జూలై 16 :** బుధవారం మండలంలోని కృష్ణునిపాలెం గ్రామంలో కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది ఇంటెన్సిఫైడ్ టీబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ సి వైద్యాధికారి డాక్టర్ తిరన్ మాట్లాడుతూ టిబి రహిత సమాజాన్ని తీర్చిదిద్దుకొనేందుకు ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని టీబీ అంతానికి అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. అలాగే సామాజిక బాధ్యతగా ఆర్థిక స్థోమత కలిగిన వారు నిక్షయ్ మిత్ర గా చేరి టిబి వ్యాధిగ్రస్తులకు పోషకాహారం అందించి చేయూతనివ్వాలన్నారు. గ్రామాలలో డయాబెటిక్ పేషెంట్లకు, పొగాకు ఉత్పత్తుల వాడే వారికి, ఇతరత్రా వ్యాధులు ఉన్నవారికి, 60 సంవత్సరాలు పైబడిన వారికి, గతంలో టిబి మందులు వాడిన వారికి, వారి కుటుంబ సభ్యులకు, కళ్లె పరీక్షలు ఎక్సరేలు తీసి వ్యాధి నిర్ధారణకు చర్యలు చేపడుతున్నామన్నారు. దగ్గు,ఇతర టిబి లక్షణాలతో బాధపడుతున్న వారు పరీక్షలు చేయించు కోవాలని సూచించారు. కార్యక్రమంలో 95 మందిని పరీక్షించి వారిలో 25 మంది నుంచి కళ్ళె పరీక్షకు శాంపిల్ సేకరించామన్నారు. రీచ్ ఎన్జిఓ డిపిసి వర్మ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ సూర్యాలాజరస్ మాట్లాడుతూ పౌష్టికాహారం ఆవశ్యకత గురించి వివరించి, టీబి వ్యాధి గ్రస్థులు తప్పనిసరి హెచ్.ఐ.వి.టెస్టులు విధిగా చేయించు కోవాలని తెలిపారు. అనంతరం అందరూ ప్రతిజ్ఞ చేసారు. ఈకార్యక్రమంలో ఎస్టి ఎస్.శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ అప్పారావు ,పవన్, ఎంఎల్ హెచ్.పి. సాత్వి సుధ, ఏఎన్ఎం వేదకుమారి, ఆశాలు కనకరత్నం, అరుణ రీచ్ టీబి ఛాంపియన్ నరసింహా, పద్మ పాల్గొన్నారు.

## లెక్చరర్ పోస్టుల పరీక్షలకు పటిష్ట భద్రత

- జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జూలై 16 :** వివిధ లెక్చరర్ పోస్టులను భర్తీ చేసేందుకు ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లాలో పటిష్ట భద్రత మధ్య పరీక్షలు జరుగుతున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు తెలిపారు. ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకూ ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా జిల్లావ్యాప్తంగా ఆరు సెంటర్లలో ఆన్లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా రెండో రోజైన బుధవారం రెండు సెంటర్లలో పరీక్షలు జరిగాయి. ఒంగోలు నగరం మామిడిపాలెంలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ ది చర్చ్ సోషల్ యాక్షన్ ఇండియా కాలేజీలో ఉదయం పరీక్షకు 170కు గాను 68 మంది, మధ్యాహ్నం పరీక్షకు 135 కి గాను 62 మంది హాజరయ్యారని తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాన్ని డీఆర్వో సందర్శించారు. అదేవిధంగా ఒంగోలు నగరంలోని బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సెంటరులో కూడా ఉదయం పూట పరీక్షలు జరిగాయి. ఇక్కడ 97కు గాను 41 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.

# మహిళా చట్టాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలి

- డి.ఎస్.పి మురళీమోహన్




**ఆలమూరు, పెన్ పవర్,జూలై 16 :** మహిళా చట్టాల పట్ల విద్యార్థి దశ నుంచి అవగాహన పెంపొందించు కోవాలని కొత్తపేట డిఎస్పి సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్ సీఐ సిహెచ్ విద్యాసాగర్, ఎస్ఐ జి.నరేష్లు సూచించారు. ఆలమూరు శ్రీ సిద్ధార్థ హైస్కూల్లో బుధవారం "మహిళలు సంరక్షణ"అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మీ బంగారు భవిష్యత్తు కోసం మీ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మిమ్మల్ని చదివిస్తున్నారని వాటిని నిర్లక్ష్యం చేయకుండా చదువుపై దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలకు చేరాలని వారు సూచించారు. మీరు స్కూలుకు వచ్చే దారిలో అనేకమంది మిమ్మల్ని పెడదారి పట్టించడానికి ప్రయత్నిస్తారని అటువంటివారిని పట్టించుకోకుండా మీ లక్ష్యం వైపు పయనించాలని వారు కోరారు. ముందుగా ప్రతి ఒక్కరూ అమ్మని గౌరవించడం నేర్చుకోవాలని అమ్మని గౌరవించిన ప్రతి ఒక్కరు మహిళల పట్ల గౌరవంగా వ్యవహరిస్తారని వారు తెలిపారు. స్కూల్ కి వచ్చే దారిలో మిమ్మల్ని ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వారి సమాచారాన్ని పోలీసులకు అందజేస్తే మీ పేర్లను గోప్యంగా ఉంచి వారిపై చర్యలు తీసుకుంటామని వారు చెప్పారు. ఈ సమావేశంలో సిద్ధార్థ స్కూల్ ఉపాధ్యాయులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# వాడపల్లి క్షేత్రంలో మరెన్నో సౌకర్యాలు

## క్యూలైన్లు, లడ్డు కౌంటర్లు, మెడికల్ క్యాంపుల విస్తరణ





**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 16 :** కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాల అభివృద్ధికి అధికారులు చర్యలు చేపట్టారు. శనివారం రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చిన నేపథ్యంలో, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు అవుతున్నాయి. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు క్యూలైన్ల విస్తరణ చేపట్టబడింది. ప్రవేశ ద్వారాల వద్ద వెడల్పాటి మార్గాలను ఏర్పాటు చేయడం ద్వారా రద్దీని సమర్థంగా నిర్వహించనున్నారు. ప్రస్తుత లడ్డు కౌంటర్లకు అదనంగా మరికొన్ని కౌంటర్లను ఏర్పాటు చేయనున్నారు, తద్వారా భక్తులకు లడ్డు పొందడంలో ఇబ్బందులు లేకుండా ఉంటాయి. అలాగే, పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితులకు అనుకూలంగా మెడికల్ క్యాంపులను కూడా ఏర్పాటు చేశారు. అవసరమైన ఔషధాలు, వైద్య సిబ్బంది అక్కడ సిద్ధంగా ఉంటున్నారు. ఈ ఏర్పాట్లను బుధవారం స్థానిక ఎమ్మార్వో రాజేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, ముదునూరి వెంకటరాజు కలిసి పరిశీలించారు. భక్తులకు మరింత సౌకర్యాలందించేందుకు అన్ని శాఖలూ సమన్వయంతో పని చేస్తున్నాయని వారు తెలిపారు.

# మున్సిపల్ కార్యాలయంలో సూర్య ఘర్ యోజనపై సమీక్ష



**అమలాపురం పెన్ పవర్ జూలై 16 :** ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకముపై అమలాపురం మున్సిపల్ కమీషనర్ వి.నిర్మల్ కుమార్ బుధవారం ఉదయం పురపాలక సంఘ కార్యాలయంలోని కమీషనర్ చాంబరు నందు సచివాలయం కార్యదర్శు లకు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా లబ్ధిదారులకు కలిగే ప్రయోజనాలు గురించి క్షుణ్ణంగా వివరించారు.ఈ పథకం ద్వారా సోలార్ రూఫ్ టాప్ లను లబ్దిదారులు ఏర్పాటు చేసుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.78000ల వరకు సబ్సిడీని పొందవచ్చునని, ఎస్సీ మరియు ఎస్టీ వారికి ప్రభుత్వమే ఉచితంగా సోలార్ రూఫ్ టాప్ లను ఏర్పాటు చేస్తుందని, మిగిలిన వారికి తక్కువ వడ్డీకే బ్యాంకు రుణాలు అందిస్తున్నాయని, అమలాపురం పురపాలక సంఘం పరిధిలో ఉన్న గృహ యజమానులకు ఈ పథకం గురించి, ప్రభుత్వం అందిస్తున్న రాయితీ గురించి వార్డు సెక్రటరీలు అందరు సమగ్రంగా వివరించి, వచ్చే రెండు రోజులలోని ఆసక్తి ఉన్న లబ్ది దారులను ఎంపిక చేసి, వారి వివరములను పురపాలక సంఘ కార్యాలయమునకు అందజేయలని కమీషనర్ వి.నిర్మల్ కుమార్ తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఎపిఈపిడిసిఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.అన్న వరం, సోలార్ రూఫ్ టాప్స్ ను ఏర్పాటు చేసే ఏజెన్సి ప్రతినిధులు పాల్గొని, ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం యొక్క ప్రయోజనాలు, ఏర్పాటు చేసుకునే విధానాన్ని గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిఈఈ కె.వి.వి.సత్యనారాయణ, టిపిఓ శ్రీమతి రాణీ సంయుక్త, ఏఈ కె.వెంకటేష్, గవర్నమెంట్ వెండర్ ఆజాద్ నాగసుధ కొండ, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.



# సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్








**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జూలై 16 :** సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండి మీ విలువైన ధనాన్ని కాపాడుకోవాలని జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ పేర్కొన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, చట్టపరమైన చర్యలు, శిక్షలు, అలాగే సైబర్ నేరాలు, బెట్టింగ్ అంశాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని బుధవారం ఒంగోలులోని ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో విద్యార్థులకు జిల్లా ఎస్పీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో యువత చాలా ముఖ్యమని, యువత మంచి నడవడితో ఉంటే సమాజం అభివృద్ధి వైపు నడుస్తుందన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న టెక్నాలజీని ఉపయోగించుకొని కొంతమంది సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేసి వారి ధనాన్ని కాజేస్తున్నారన్నారు. ప్రజల అత్యాశ, భయాందోనలను ఆసరాగా చేసుకొని ఫేస్ బుక్, ఇన్స్టాగ్రామ్ ట్విట్టర్ ల ద్వారా జరిగే మోసాల గురించి, ఓటిపి, ఎస్ఎంఎస్, డిజిటల్ అరెస్ట్, ప్రభుత్వ స్కీం ద్వారా, వివిధ ఆన్లైన్ లింకుల వలన జరిగే నేరాలు గురించి, ఫోన్లు చేసి లింకులు పంపించి క్లిక్ చేయమనే మోసాలు, క్యూఆర్ కోడ్ స్కానింగ్ మోసాల గురించి, కెవైసి అప్డేట్ చేస్తామని చేసే మోసాల గురించి, జాబులు ఇప్పిస్తాం అని నమ్మించి మోసం చేసే వారి గురించి, ఇతర స్కామ్ ల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎక్కువగా చదువుకున్న వాళ్ళే మోసపోతున్నారన్నారు. మన యొక్క సమాచారం తెలుసుకొని ఎక్కడైతే భయపడుతున్నామో చేసుకొని మనల్ని భయపెట్టడం జరుగుతుందని, మన ఫోన్ లో ఉన్న డేటా ఫోటోలు, ఇతర సమాచారం తీసుకోని బెదిరించి డబ్బులు తీసుకోవటం జరుగుతుందన్నారు. ఈ తరహా కాల్స్ వచ్చినపుడు, ఎవరైనా సైబర్ నేరాల వల్ల నగదు పోగొట్టుకున్నప్పుడు భయభ్రాంతులకి లోనవకుండా తక్కువసమయంలో"గోల్డెన్ అవర్" విషయాన్నీ వెంటనే 1930కు లేదా సైబర్ క్రైం పోర్టల్ లో ఫిర్యాదు చేయాలన్నారు. ప్రజలందరూ సైబర్ నేరాల గురించి అవగాహన కలిగి ఉండాలని, డబ్బులను ఎవరూ ఊరకనే ఇవ్వరన్న విషయాన్ని గుర్తించుకోవాలని, అత్యాశలకు వెళ్ళి మోసపోకూడదని, సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు, నియమాలు పాటించాలని, ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చెయ్యాలని జిల్లా ఎస్పీ ప్రజలను కోరారు. బెట్టింగ్ వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించి, వారిని ఈ దుష్ప్రవర్తన గురించి జిల్లా ఎస్పీ వివరించారు. గంజాయి మాదకద్రవ్యాలు వాడకం వలన మెదడుపై, మానసిక ఆరోగ్యం, అంతర్గత అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ఒక్క సారి డ్రగ్స్ సేవించడం మొదలు పెడితే వాటి నుండి బయట పడడం అంత సులువు కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, జిల్లా ఔషధ నియంత్రణ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ జ్యోతి, ఎస్బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, ఐటి కోర్ ఇన్స్పెక్టర్ సూర్యనారాయణ, ఒంగోలు సబ్ డివిజన్ సీఐలు సుధాకర్, నాగరాజు, శ్రీనివాసరావు, శ్రీకాంత్, హాజరత్తయ్య, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పాండు రంగారావు, ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ నిర్మలా మణి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్గా హర్ష ప్రీతం దేవ్, ఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు.

# జీవో నెం.3 పునరుద్ధరణకు గిరిజనుల అభిప్రాయ సేకరణ

- గిరిజన సంఘాలు,ఉపాధ్యాయ సంఘాలు,న్యాయవాదులతో సమీక్ష... - గిరిజనుల పక్షాన మెటీరియల్ సేకరించి ప్రభుత్వానికి నివేదిక...
- జీవో నెం.3తో 4,626 గిరిజనులకు ఉపాధ్యాయ ఉద్యోగాలు.. - సుప్రీంకోర్టులో జీవో రద్దుకి కారణాలపై న్యాయసలహాలు....
- మాజీ ఎమ్మెల్యేలు, గిరిజన నాయకుల వినతిపత్రాల సమర్పణ... - డైరెక్టర్ భార్గవికి గిరిజన సంఘాల తరపున సన్మానం..
- గిరిజన సమస్యలపై కమిటీలు ఏర్పాటు చేసి తీర్మానాల నిర్ణయం...



**దేవీపట్నం,పెన్ పవర్,జూలై16 :** గిరిజనులకు అనుకూలంగా జీవో నెంబర్ 3 పునరుద్ధరించేందుకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ చర్యలు చేపట్టిందని,ఇందుకోసం గిరిజనుల అభిప్రాయాలను సేకరించి ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ భార్గవి వెల్లడించారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, న్యాయవాదులతో వర్క్షాప్ నిర్వహించారు. డైరెక్టర్ భార్గవి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో 20 ఏళ్ల క్రితం అమలైన జీవో నెం.3ను సుప్రీంకోర్టు రద్దు చేయడంతో, దానిని తిరిగి అమలు చేయాలన్న డిమాండ్లు పెరిగాయని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లోని ఐటీడీఏల పరిధిలో గల గిరిజన సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాలు నిర్వహించి ప్రొఫార్మాల ద్వారా అభిప్రాయాలు సేకరిస్తున్నామని తెలిపారు.అందిన అభిప్రాయాలను ముఖ్యమంత్రి, మంత్రులు,ముఖ్యకార్యదర్శి దృష్టికి తీసుకెళ్లి గౌరవ సుప్రీంకోర్టులో సమర్థించేందుకు అవసరమైన మెటీరియల్ సిద్ధం చేయనున్నట్టు చెప్పారు.జీవో నెం.3 అమలుతో 4,626 మంది గిరిజనులకు ఉపాధ్యాయ ఉద్యోగాలు లభించాయని గుర్తు చేశారు. మహారాష్ట్ర, జార్ఖండ్లోనూ ఇలాంటి సమస్యలే ఉన్నాయని తెలిపారు. ఈ వర్క్షాప్ గిరిజన సంఘాలకు అతీతంగా, పార్టీ రాజకీయాలకు అతీతంగా ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ జీవో నెం.3 రద్దుతో ఏజెన్సీ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తరచూ తీసుకెళ్తున్నామని తెలిపారు. గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా ఐటీడీఏ కృషి చేస్తుందని చెప్పారు.న్యాయవాది పళ్ళ త్రినాథరావు మాట్లాడుతూ జీవో నెం.3ను సుప్రీంకోర్టు ఎందుకు కొట్టి వేసిందో, తదితర జీవోలు 275, 73, 1/70, 375 లపై వర్క్షాప్లో వివరణ ఇచ్చినట్టు తెలిపారు.గిరిజన చట్టాలను అమలు చేయాలని,జీవో నెం.3ను పునరుద్ధరించాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు.మాజీ ఎమ్మెల్యేలు సీతంశెట్టి వెంకటేశ్వరరావు, కంగాల శ్రీనివాసరావు దొర, మీడియం శ్రీనివాసరావు దొర, కొవ్వాసి శ్రీనివాసరావు, ఇతర గిరిజన నాయకులు డైరెక్టర్కు వినతిపత్రాలు అందజేశారు.కమిటీలు ఏర్పాటు చేసి తీర్మానాలు తీసుకుని జీవో నెం.3 పునరుద్ధరణకు కృషి చేయాలని కోరారు.ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ కట్టా సింహాచలం డైరెక్టర్ భార్గవికి సన్మానం చేశారు. గిరిజన సంఘాల ప్రతినిధులు డైరెక్టర్కు సాలువలు కప్పి, ఏజెన్సీలోని సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్,ఏపీఓ జనరల్ డీఎన్వీ రమణ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, పీహెచ్ఓ దేవదానం,ఎస్ఓ మార్తమ్మ, సహాయ అధికారి కృష్ణమోహన్, గిరిజన నాయకులు కే రంగారావు, బుడుమల మంగిరెడ్డి,యం. కరుణ విలాస్,బొగ్గుల కాటంరెడ్డి, వజ్రపు అప్పారావు, తీగల బొజ్జయ్య,తెల్లం శేఖర్, వెలగాడ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



# నెక్స్ట్ పీఎం యోగీనా...అమిత్ షానా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** కేవలం రెండు నెలలు మాత్రమే. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వయసు 75 నిండుతాయి. సెప్టెంబర్ 17 కి ఆయన 76వ పడిలోకి ప్రవేశిస్తారు. అంటే ఇక్కడే ఇటీవలనే ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వార్తలు గుర్తుకు వస్తున్నాయి. ఏడున్నర పదుల వయసు నిండిన వారు రాజకీయాలకు దూరంగా ఉండాలంటూ మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలే ఇటీవల చేశారు. ఆయన జనరల్ గా చేసినట్లు అనిపిస్తున్నా మోడీ 75 ఏళ్ళకు దగ్గరగా ఉండడంతో ఆయన మీదనే పరోక్షంగా వ్యాఖ్యలు చేశారా అన్న చర్చ సాగుతోంది. అంతే కాదు ఆర్ఎస్ఎస్ అంటేనే బీజేపీకి మార్గదర్శిగా ఉంటూ వస్తోంది. కాబట్టి ఎవరో కాదు ఏ పార్టీకో అంతకంటే కాదు బీజేపీకే అది కూడా మోడీకే సలహా ఇచ్చినట్లుగా ఉందని విశ్లేషణలు అయితే మొదలయ్యాయి.సరే బీజేపీకే మోడీకే ఈ కామెంట్స్ అని అనుకున్నపుడు మోడీ నిజంగా దానిని పాటించాలని అనుకున్నప్పుడు ఆయనే తప్పుకున్నపుడు బీజేపీలో మోడీ తర్వాత ప్రధానమంత్రి ఎవరు అన్నది మరో చర్చగా ఉంది. మోడీ తరువాత ప్రధాని పదవికి పోటీ పడే వారు ఎవరెవరు అంటే చాలా పేర్లు వినిపిస్తాయి.

అయితే బీజేపీది హిందూత్వ నినాదం. ఆర్ఎస్ఎస్ కూడా దానినే గట్టిగా ప్రచారం చేస్తూ ఉంటుంది. మరి ఆ వాదాన్ని ఏ రకమైన వివాదం లేకుండా జనంలోకి తీసుకుపోవడానికి ఒక పవర్ ఫుల్ ఇమేజ్ ఉన్న నాయకుడు కావాలి. ఒక వైపు నాయకుడిగా ఉంటూనే మరో వైపు బీజేపీ హిందూత్వను జనంలో పెట్టి ఆకట్టుకునే ఘన నేత ఎవరు అన్నది కూడా అంతా ఆలోచిస్తున్నారు.అలా చూస్తే కనుక ఆర్ఎస్ఎస్ మదిలో మెదిలే ఒకే ఒక్క పేరు యోగి ఆదిత్యనాథ్ అని అంటున్నారు. ఆయన 2017లో ఉత్తరప్రదేశ్ లాంటి అతి పెద్ద రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. గత ఎనిమిది ఏళ్ళుగా ఆయన సీఎంగానే ఉంటున్నారు. మరో రెండేళ్ళలో యూపీ ఎన్నికలు ఉన్నాయి. ఇక యోగీ యూపీ సీఎం అయ్యేంతవరకూ ఎవరికీ పెద్దగా తెలియదు. కానీ ఆయన సీఎం అయ్యాక తనకంటూ ఒక ఇమేజ్ ని సొంతం చేసుకున్నారు. అంతే కాదు ఆయన యూపీలో తనదైన శైలిలో పాలన చేస్తున్నారు. కరడు కట్టిన హిందూత్వకు ఆయన ప్రతిరూపంగా కనిపిస్తారు. ఆయన హయాంలోనే యూపీలో అయోధ్యలో రామమందిరం సాధ్యపడింది. యోగీ బ్రహ్మచారి. సనాతన ధర్మ నిష్ఠా గరిష్టుడు. ఏ బాదరబందీ లేనివారు. తన సొంత కుటుంబాన్నే ఆయన రాజకీయాలకు అధికారానికీ దూరం ఉంచారు. ఇలా చూస్తే కనుక యోగికి ఎన్నో ప్లస్ పాయింట్స్ కనిపిస్తాయి. మోడీ కనుక ప్రధాని పదవి నుంచి దిగిపోతే యోగీనే తరువాత పీఈఎం గా చేయాలని ఆర్ఎస్ఎస్ గట్టిగా తపన పడుతోంది అని ప్రచారంలో అయితే ఉంది. అయితే మోడీ కనుక అనివార్యంగా తన పదవి నుంచి తప్పుకుంటే కనుక తన వారసుడిగా అమిత్ షా పేరునే సూచిస్తారు అని అంటున్నారు. గత పదకొండేళ్ళుగా చూస్తే కనుక బీజేపీలోనూ ప్రభుత్వంలోనూ మోడీ అమిత్ షాలదే పట్టు అన్నది కూడా చెబుతారు. అంతే కాదు మోడీ కంటే కూడా సంస్థాగతంగా అమిత్ షా పట్టు సాధించి ఉన్నారని అంటారు. బీజేపీలోనూ ప్రభుత్వంలోనూ అన్ని వ్యవహారాలూ అమిత్ షాయే దగ్గరుండి చూసుకుంటారు అని కూడా చెబుతారు. ఇదంతా మోడీ తర్వాత ఆయనే అని బలమైన సంకేతాలు ఇస్తున్నాయి. మోడీ అమిత్ షా ఇద్దరూ గుజరాత్ రాష్ట్రానికి చెందిన వారు. మోడీ దిగిపోతే అదే రాష్ట్రానికి చెందిన వారికే చాన్స్ దక్కాలని కూడా ఉంటుందని అంటారు. అంతే కాదు మొరార్జీ దేశాయ్ తరువాత దాదాపు నాలుగు దశాబ్దాల తరువాత గుజరాత్ నుంచి దేశానికి ప్రధాని అయ్యే చాన్స్ వచ్చింది. మళ్ళీ ఇపుడు కాకపోతే మరెప్పుడు అన్నట్లుగా ఉంటుంది కాబట్టి అమిత్ షానే ప్రకటించవచ్చు అన్నది కూడా మరో చర్చ. ఇక ప్రధాని పీఠానికి అతి సమీపంలో అమిత్ షా ఉన్నారని కూడా ఈ సందర్భంగా చెబుతారు. ఇక చూస్తే ఆర్ఎస్ఎస్ మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అమిత్ షా ప్రధాని కావడానికి అంగీకరించదని కూడా అంటున్నారు. బీజేపీని వ్యక్తి పూజ నుంచి తిరిగి బయటకు తెచ్చి సంస్థాగతంగా బలోపేతం చేయాలని సిద్ధాంత పునాదుల మీదనే పార్టీని పునర్ నిర్మించాలని ఆర్ఎస్ఎస్ భావిస్తోంది అని అంటున్నారు. ఈ క్రమంలోనే యోగీకే ఆర్ఎస్ఎస్ జై కొడుతుందని ఆయనకే పట్టం కట్టాలని తన డిమాండ్ గా ముందు పెడుతుందని అంటున్నారు. అంటే మోడీ దిగిపోతే కనుక ఆర్ఎస్ఎస్ బీజేపీల మధ్య ఈ విషయంలో ఒక అభిప్రాయ భేదం అయితే రావచ్చు అని అంటున్నారు. బీజేపీలో ఆర్ఎస్ఎస్ ప్రభావం ఏ మేరకు ఉంటుందో కూడా తాను కోరుకున్న వారిని ప్రధాని పీఠం మీద కూర్చోబెట్టే విషయంలో తెలుస్తుందని అంటున్నారు. మొత్తం మీద చూస్తే ఆర్ ఎస్ ఎస్ మాత్రం భారీ వ్యూహంతోనే ఉందని చెబుతున్నారు. ఊరకే 75 ఏళ్ళకే తప్పుకోవాలని అనలేదని అంటారు. తిరిగి బీజేపీని పూర్తిగా తన నియంత్రణలోకి తెచ్చుకోవాలని తాను అనుకున్న వారే ప్రధాని కావాలన్న సంఘ్ పంతం పట్టుదల ఎంతమేరకు నెగ్గుతుంది అన్నది రానున్న కాలమే తేల్చుతుంది అని అంటున్నారు.

# నారా లోకేష్ ట్వీట్ కు అలా స్పందించిన కర్ణాటక మంత్రి!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో కూటమి ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచీ రాష్ట్రానికి పెద్ద ఎత్తున దేశీయ, అంతర్జాతీయ సంస్థలను పెట్టుబడులు పెట్టడానికి ఆహ్వానిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఆయా సంస్థలకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాల గురించి వివరిస్తున్నారు. ఈ సమయంలో తాజాగా ఏరో స్పేస్ పరిశ్రమను ఏపీకి ఆహ్వానిస్తూ మంత్రి లోకేష్ చేసిన ట్వీట్ కు కర్ణాటక మంత్రి స్పందించారు.అవును... కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ప్రతిపాదిత ఏరోస్పేస్ పార్క్ కోసం దేవనహళ్లీ తాలుకాలో 1777 ఎకరాల వ్యవసాయ భూములను సేకరించే ప్రతిపాదనను కర్నాటక ప్రభుత్వ విరమించుకుంటుందని.. సీఎం సిద్దరామయ్య ప్రకటించారు. దీంతో.. ఇది నిరసన తెలుపుతున్న రైతులకు పెద్ద ఉపశమనంగా భావిస్తున్నారు.ఈ సందర్భంగా స్పందించిన సీఎం సిద్ధరామయ్య... తాము భూసేకరణ ప్రక్రియను నిలిపివేశామని.. అయితే, కొంతమంది రైతులు స్వచ్ఛందంగా తమ భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చారని.. వారి నుంచి మాత్రమే ప్రభుత్వం భూములను సేకరిస్తుందని.. వారికి అధిక పరిహారంతోపాటు, డెవలపింగ్ చేసిన ప్లాట్ లను అందిస్తామని అన్నారు.ఈ విషయంపై స్పందించిన ఏపీ మంత్రి నారా లోకేష్... ఈ విషయం తెలిసిన తర్వాత తనకు బాధగా ఉందని.. మీ కోసం తమ దగ్గర మంచి ఆలోచన ఉందని.. మీరు ఆంధ్రప్రదేశ్ వైపు ఎందుకు చూడకూడదు? అంటూ ఏరో స్పేస్ ఇండస్ట్రీని ప్రశ్నించారు. మీ కోసం మా వద్ద ఆకర్షణీయమైన ఏరోస్పేస్ పాలసీ ఉందని ఎక్స్ వేదికగా తెలిపారు.ఇదే సమయంలో... అత్యుత్తమ ప్రోత్సాహకాలతో పాటు 8000 ఎకరాలకు పైగా భూమి సిద్ధంగా ఉందని చెబుతు... త్వరలో మిమ్మల్ని కలవాలని ఆశిస్తున్నట్లు ఏరో స్పేస్ ప్రతినిధులకు తెలిపారు! ఈ నేపథ్యంలోనే కర్ణాటక మంత్రి ఎంబీ పాటిల్ స్పందించారు. ఈ సందర్భంగా సుదీర్ఘ పోస్టు పెట్టారు.ఇందులో భాగంగా... కర్ణాటక భూమిని మాత్రమే అందించదని.. ఇది భారతదేశంలో నంబర్ 1 ఏరోస్పేస్ %డ% డిఫెన్స్ ఎకోసిస్టమ్ ను అందిస్తుందని.. తామంతా దశాబ్దాలుగా దేశంలోనే బలమైన ఏరోస్పేస్ స్థావరాన్ని నిర్మించామని.. భారతదేశ ఏరోస్పేస్ ఉత్పత్తిలో 65% తోడ్పడి జాతీయంగా, ప్రపంచవ్యాప్తంగా నంబర్ 1 స్థానంలో నిలిచామని ఎక్స్ వేదికగా వెల్లడించారు.ఇది భూమి గురించి మాత్రమే కాదని.. ఇది ప్రతిభ, ఆవిష్కరణ, నిరూపితమైన ఎకోసిస్టమ్ గురించని తెలిపారు. ఏమి చేయాలో, ఎప్పుడు చేయాలో, ఎలా చేయాలో మాకు తెలుసని.. ఏమీ జారిపోదని అన్నారు. %వి%1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థను చేరుకున్న మొదటి రాష్ట్రాలలో కర్ణాటక ఒకటి అవుతుందని స్పష్టం చేశారు.ఇదే సమయంలో... ఇది ఏరోస్పేస్ మాత్రమే కాదు.. అనేక కొత్త పరిశ్రమలు కర్ణాటకను ఎంచుకుంటూనే ఉన్నాయని తెలిపారు. వృద్ధి, కొత్త పెట్టుబడులు రెండింటికీ మద్దతు ఇవ్వడానికి అవసరమైన భూమి మరియు ఎకోసిస్టమ్ ను తాము ఎల్లప్పుడూ నిర్ధారిస్తామని అన్నారు. ఈ సందర్భంగా... ఏపీకి కూడా బెస్ట్ విషెస్ చెప్పారు.

# మా పోలీసులు.... కూటమి పోలీసులూ.... జగన్ కామెంట్స్ వైరల్!



**హైదరాబాద్ పెన్ పవర్:** తన ప్రభుత్వం హయాంలో పోలీసులు ప్రజలతో ఎంతో ఫ్రెండ్లీగా ఉండేవారని ప్రజలకు అనుకూలంగా పోలీసులు ఆ రోజు ఉన్నారంటూ వైసీపీ అధినేత జగన్ చేసిన కామెంట్స్ ఇపుడు వైరల్ అవుతున్నాయి. ఆనాడు పోలీసులను ఉపయోగించి విపక్షాలను కట్టడి చేసే ప్రయత్నం చేయడం జరిగిందనే కదా అంతా మొత్తుకున్నారని నెటిజన్లు కామెంట్స్ పెడుతున్నారు.

ఏపీలో ఒక చెడు సంప్రదాయం అంటూ వచ్చిందంటే అది వైసీపీ హయాంలోనే కదా మొదలైంది అని గుర్తు చేస్తున్నారు. కూటమి ఏలుబడిలో పోలీసులు తమను తమ పార్టీ వారిని కట్టడి చేస్తున్నారు అని జగన్ విమర్శలు చేసే క్రమంలో తామేంతో మంచి పోలీసింగ్ వ్యవస్థను అందించామని చెప్పుకోవడం పట్ల ప్రతి విమర్శలు వస్తున్నాయి.

ఆనాడు పోలీసులు ప్రజల సమస్యలను సామరస్యంగా పరిష్కరించారాని అంతే కాక టీడీపీ జనసేన వంటి ప్రతిపక్ష పార్టీల సమస్యలను కూడా పరిష్కరించారని జగన్ చెప్పుకొచ్చారు. తమ హయాంలో పోలీసులు గర్వంగా గౌరవంగా పనిచేసారు అని జగన్ చెప్పారు. పోలీస్ వ్యవస్థలో సంస్కరణలు అమలు చేసామని అన్నారు అంతే కాదు స్పందన వంటి కార్యక్రమల ద్వారా పరిష్కారాలు చూపామని జగన్ చెప్పారు. ప్రతిపక్షాలకే ఎక్కువ న్యాయం చేశామని జగన్ అంటున్నారు.అయితే జగన్ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విమర్శలకు దారితీస్తున్నాయి. నిజానికి వైసీపీ ఏలుబడిలోనే రాజకీయ నాయకులనే కాకుండా అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకోవడానికి పోలీసులను అధికారాన్ని పెద్ద ఎత్తున దుర్వినియోగం చేశారని టీడీపీ, జనసేన వంటి ప్రతిపక్ష పార్టీలు తీవ్రమైన ఆరోపణలు చేశాయని పాత విషయాలను చాలా మంది నెటిజన్లు సోషల్ మీడియా ద్వారా ఎత్తి చూపుతున్నారు.అంతే కాదు జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జరిగిన అనేక సంఘటనల గురించి కూడా వారు ప్రస్తావిస్తున్నారు. విశాఖలో చూస్తే డాక్టర్ సుధాకర్‌ను అరెస్టు చేసిన తీరు వివాదాస్పదం అయిందని గుర్తు చేస్తున్నారు. అంతే కాకుండా ఆనాటి వైసీపీ ఎంపీ రఘురామ కృష్ణం రాజును అరెస్టు చేసిన విధానం కానీ అదే విధంగా అనేక మంది టీడీపీ, జనసేన నాయకులు అరెస్టు చేసిన తీరు కానీ తలచుకున్న వారు ఏమి గర్వంగా నాడు పని చేయించారు అని ఎదురు ప్రశ్నిస్తున్నారు.జగన్ హయాంలో పోలీసులు ప్రజలకు అనుకూలంగా కాకుండా వైసీపీ తనకు అనుకూలంగా మార్చుకుందని కూడా నిందిస్తున్నారు. జగన్ తాజా ప్రకటనలు పాత విషయాలను వేరే విధంగా మార్చి చెప్పడమే అని అంటున్నారు. అలా చేసినా కూడా అవి మాసిపోవని అంటున్నారుఇక జగన్ కూటమి ప్రభుత్వం మీద పోలీసుల మీద తీవ్ర విమర్శలు అయితే చేశారు. కూటమి పాలనలో పోలీసులను ముందు పెట్టి తమను అణచేందుకు ప్రయత్నం చేస్తున్నారని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి పాలనలో తాను చేసిన ఆనేక పర్యటనలో తన మీద తన పార్టీ కార్యకర్తల మీద కేసులు పెడుతూ భయానక వాతావరణ సృష్టిస్తున్నారని జగన్ ధ్వజమెత్తారు.చంద్రబాబుకు మూడ్ ఉంటేనే తనకు జెడ్ ప్లస్ సెక్యూరిటీ దక్కుతోందని లేకపోతే లేదని ఆయన విమర్శించారు. సత్తెనపల్లి, పొదిలి సహా తన పర్యటనలలో అల్లర్లు అలజడి సృష్టించాలని ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. తన సభలకు జనాలు రావడం తాను ప్రజా సమస్యల మీద మాట్లాడడం కూటమి పెద్దలకు ఏమాత్రం నచ్చడం లేదని జగన్ అన్నారు ఇక గుంటూరు మిర్చియార్డులో తాను రైతులను పరామర్శిస్తే తనపైనే తిరిగి కేసులు పెట్టారని జగన్ విమర్శించారు.కూటమి పెద్దలు తమకు నచ్చని పోలీసు అధికారులకు పోస్టింగులు ఇవ్వకుండా వేధిస్తున్నారని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇలా అనేక మంది అధికారులను ఖాళీగా కూర్చోబెట్టారని అన్నారు. ఈ అవమానాలు భరించలేక సిద్ధార్థ్ కౌశల్ వంటి మంచి పోలీసు అధికారులు రాష్ట్రాన్ని వదిలి వెళ్ళిపోతున్నారని జగన్ అన్నారు. ఇక డీజీ స్థాయి అధికారులు అయిన పీఎస్ ఆర్ ఆంజనేయులు, సునీల్ కుమార్, డీఐజీ విశాల్ గున్నీ లాంటి అధికారుల మీద తప్పుడు కేసులు బనాయించి అరెస్టులు సస్పెండ్ చేస్తున్నారని జగన్ మండిపడ్డారు.తనకు అనుకూలంగా ఉన్న పోలీసు అధికారులను పెట్టుకుని అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్నారని చెబుతున్నారు. మద్యం ఇసుక బెల్ట్ షాపుల విషయంలో ఏమి జరిగినా ఒక గ్యాంగ్ ని పెట్టి మరీ వసూళ్ళు బెదిరింపులు వసూలు చేస్తున్నారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఏపీలో అక్రమ కలెక్షన్ జోరుగా సాగుతోందని పెదబాబు చినబాబు స్థాయిలోకి అందుతోందని అన్నారు.

# కంటికి కనిపించని అతిపెద్ద ఆన్ లైన్ చీకటి సామ్రాజ్యం గురించి తెలుసా?



**హైదరాబాద్ పెన్ పవర్:** మామూలు సెర్చ్ ఇంజిన్లకు ఇది చిక్కదు.. యాక్సెస్ చేయడం అందరివల్లా కాదు.. దీన్ని యాక్సెస్ చేయాలంటే ప్రత్యేకమైన బ్రౌజర్లు కావాలి.. గూగుల్, యాహూ, ఫైర్ ఫాక్స్ వంటి ఓపెన్ వెబ్ బ్రౌజర్లతో ఇది సాధ్యం కాదు.. తమ ఐడెంటిటీ గోప్యంగా, అజ్ఞాతంగా ఉండాలని కోరుకునేవారికిది ఓ రక్షణ స్థావరాన్ని సృష్టిస్తుంద.. అదే ఆన్ లైన్ చీకటి సామ్రాజ్యం.. డార్క్ వెబ్.

అమెరికా నేవల్ రిసెర్చ్ లేబరేటరీ అప్పట్లో ద ఆనియన్ రూటింగ్ ప్రాజెక్ట్ (టోర్) ప్రాథమిక వెర్షన్ తో 90ల్లోనే దీనికి పునాది పడింది. పేరుకు తగ్గట్టుగా ఇది ఉల్లి పొరల మాదిరిగా కమ్యూనికేషన్ నెట్ వర్క్ లో ఎన్క్రిప్షన్ లను పొందుపరుస్తుంది. ఆన్ లైన్ గోప్యతను మరింత కట్టుదిట్టం చేసే లక్ష్యంతో రోజర్ డింగెల్ డైన్, ఆయన బృందం టోర్ ను రూపొందించింది.ఇది డేటాను ఎన్ క్రిప్ట్ చేయటం ద్వారా యూజర్ చిరునామాను దాచి పెడుతుంది. మొదట్లో మంచి ఉద్దేశం కోసం రూపొందించినప్పటికీ క్రమక్రమంగా అక్రమ కార్యకలాపాలకు వాడుకోవటం ఎక్కువైంది.. మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాల వంటి పనులకు ఇది ప్రసిద్ధి చెందింది. ఇటీవల కేరళకు చెందిన ఒకరు ఇందులో డ్రలిగ్స్ అమ్ముతున్నందుకు గాను పోలీసులు అరెస్ట్ చేశారు.

ఇది ఇలా పూర్తిగా డ్రలిగ్స్, సైబర్ నేరాలు, తుపాకుల అమ్మకాలు మొదలైన అక్రమ కార్యకలాపాలకు పెట్టింది పేరైనట్లుగా ఉన్నప్పటికీ... ఈ డార్క్ వెబ్ కొన్ని మంచి పనులకూ ఉపయోగపడుతోంది! ఇందులో భాగంగా.. గూఢచారులు, జర్నలిస్టులు మొదలైనవారు పీడిత పాలనలో రహస్య సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవటానికి దీన్ని వాడుకుంటుంటారు.తమ డేటాను కాపాడుకోవటానికి కొన్ని ఆసుపత్రులు, ఇతర సంస్థలు సైతం దీన్ని వాడుకుంటున్నాయని చెబుతున్నారు. అయితే ఈ అజ్ఞాత ధోరణే సైబర్ నేరాలకు ఊతమిస్తోందని అంటున్నారు. ప్రధానంగా... డ్రలిగ్స్, దొంగ నోట్లు, మాల్వేర్ లావాదేవీలకు ఇక్కడ ఆస్కారం కల్పిస్తోంది.ఈ నేపథ్యంలోనే... ప్రపంచవ్యాప్తంగా చట్టపరమైన సంస్థలు డార్క్ వెబ్ వ్యవహారాలనూ ఓ కంట కనిపెడుతూనే ఉంటాయి. అయితే... అధునాతన ఎన్ క్రిప్షన్ పద్ధతుల మూలంగా నేరగాళ్లను గమనించటం ఇటీవల పెద్ద సమస్యగా నిలుస్తోందని అంటున్నారు. అయినప్పటికీ అధునాతన విధానాలతో పోలీసులు నేరగాళ్లను పట్టుకుంటున్నారు. వాస్తవానికి వెబ్ సైట్ లు సాధారణంగా “.కాం” మరియు “.ఆర్గ్” వంటి రిజిస్ట్రీ ఆపరేటర్ లతో లేబుల్ చేయబడతాయి. ప్రసిద్ధ సెర్చ్ ఇంజిన్ లతో సులభంగా గుర్తించబడతాయి. అతితే... ఈ డార్క్ వెబ్ లో వెబ్ సైట్లు “.ఆనియన్” డొమైన్లను వాడు కుంటాయి. సంప్రదాయ సెర్చ్ ఇంజిన్ల ఇండెక్స్ లో ఇవి ఉండవు.

సాధారణంగా ‘టోర్’ను డౌన్ లోడ్ చేసుకొని డార్క్ వెబ్ ను ఉపయోగించుకుంటారు. ఇది నోడ్స్ అని పిలుచుకునే పలు సర్వర్ల ద్వారా కనెక్షన్లను దారి మళ్లిస్తుంది. ఈ క్రమంలో ప్రతి దశలోనూ డేటాను రహస్య లిపిలోకి మారుస్తుంది. అందువల్ల డార్క్ వెబ్ లో జరిగే వ్యవహారాలను పట్టుకోవటం దాదాపు అసాధ్యమనే చెప్పుకోవచ్చు.

# బ్లడ్ మనీ వద్దు.. కేరళ నర్సు కేసులో ఊహించని ట్విస్ట్!



**హైదరాబాద్ పెన్ పవర్:** యెమెన్‌లో దోషిగా నిలిచిన కేరళ నర్సు నిమిష ప్రియ కేసు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీస్తోంది. ఆమెకు విధించిన మరణశిక్ష నేడు అమలవ్వాల్సి ఉండగా, యెమెన్ ప్రభుత్వం తాత్కాలికంగా ఆ శిక్షను వాయిదా వేసిన విషయం కాస్త ఊరటనిచ్చింది. అయితే, బాధిత కుటుంబం మాత్రం శిక్ష అమలే జరగాలని గట్టిగా అభిప్రాయపడుతోంది.

**బ్లడ్‌మనీని తిరస్కరించిన మృతుడి కుటుంబం**

యెమెన్ పౌరుడైన తలాల్ అదిబ్ మెహదిని హత్య చేసిన కేసులో నిమిష ప్రియకు శిక్ష విధించారు. ఈ శిక్ష నుంచి బయటపడేందుకు ఆమె కుటుంబం బ్లడ్‌మనీ (క్షమాధనం) కింద 1 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 8.6 కోట్లు) చెల్లించేందుకు సిద్ధమైంది. అయితే, మృతుడి సోదరుడు అబ్దుల్ ఫత్తా మెహది బ్లడ్‌మనీని తిరస్కరించారు. “నేరానికి క్షమాపణ ఉండదు, బ్లడ్‌మనీని మేము తిరస్కరిస్తున్నాం” అని స్పష్టం చేశారు. ఫేస్‌బుక్‌లో పోస్టు చేసిన ఆయన, “మధ్యవర్తిత్వాలు, ఒత్తిడులు కొత్తవి కావు. మేము ఎదుర్కొంటున్న ఒత్తిళ్లు మా అభిప్రాయాన్ని మార్చవు. డబ్బుతో ప్రాణానికి వెలకట్టలేం. మాకు న్యాయం దక్కాల్సిందే” అని తేల్చిచెప్పారు. అలాగే నిమిషను బాధితురాలిగా చూపించే ప్రయత్నాలను ఖండించారు.

**–భారత ప్రభుత్వం కృషి.. తాత్కాలిక ఊరట**

నిమిష ప్రియ మరణశిక్షను వాయిదా వేయించిన విషయం భారత విదేశాంగ శాఖ మంగళవారం స్పష్టం చేసింది. యెమెన్ జైలు అధికారులు, ప్రాసిక్యూషన్ కార్యాలయంతో సంప్రదింపులు జరిపినట్టు తెలిపింది. నిమిష, బాధిత కుటుంబాలు పరస్పర అంగీకారానికి రావాలని కోరుతూ గత కొద్ది రోజులుగా యెమెన్ ప్రభుత్వంపై భారత్ ఒత్తిడి తెచ్చిందని పేర్కొంది.

**మతగురువు మౌనవాదం.. పరిష్కార మార్గం?**

ఈ కేసును పరిష్కరించేందుకు మతపరంగా కూడా ప్రయత్నాలు సాగుతున్నాయి. ప్రముఖ ముస్లిం మత గురువు కాంతాపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ బాధిత కుటుంబాన్ని ఒప్పించే ప్రయత్నంలో ఉన్నారు. బ్లడ్‌మనీ తీసుకునేందుకు వారిని ఒప్పించాలన్న దిశగా చర్చలు కొనసాగుతున్నాయి. అయితే ఈ చర్చలు ఎంతవరకు ఫలిస్తాయోనన్న ఉత్కంఠ నెలకొంది. నిమిష ప్రియ జీవితం ఇప్పుడు యెమెన్ న్యాయవ్యవస్థ, మానవతా విలువల మధ్య జరుగుతున్న సంక్లిష్ట పరిస్థితిపై ఆధారపడిపోయింది. బాధిత కుటుంబం క్షమించకపోతే.. శిక్ష తప్పే అవకాశాలు కాస్త సంక్లిష్టంగా మారతాయి. మరోవైపు, మానవతా దృష్టితో నిమిషకు రెండో అవకాశం ఇవ్వాలన్న భావన కూడా పలు వర్గాల్లో ప్రతిధ్వనిస్తోంది. అయినా చట్టం, దయ మధ్య ఆఖరి నిర్ణయం ఎవరిది? అనేదే ఇప్పుడు అంతులేని చర్చకు దారి తీస్తోంది.

## సగం ర్యాంకులు కంగారులవే.. టాప్-10లో ఐదుగురు ఆసీస్ బౌలర్లు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్స్ లో ఆస్ట్రేలియా ఆధిపత్యం చూపిస్తుంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా జట్టులో ఐదుగురు బౌలర్లు బుధవారం (జూలై 16) ఐసీసీ విడుదల చేసిన టెస్ట్ ర్యాంకింగ్స్ టాప్- 10లో చోటు దక్కించుకోవడం విశేషం. మొన్నటి వరకు కంగారూల తుది జట్టులో స్థానం సంపాదించుకోలేని స్కాట్ బోలాండ్ కూడా టాప్-10 కు చేరుకోవడం ఆసక్తికరంగా మారింది. కమ్మిన్స్, హేజాల్ వుడ్, బోలాండ్, నాథన్ లియాన్, మిచెల్ స్టార్క్ టాప్-10 లో ఉన్నారు. ఆసీస్ కెప్టెన్ కమ్మిన్స్ 838 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నాడు. కమ్మిన్స్ టెస్టుల్లో గత కొన్నేళ్లుగా నిలకడగా రాణిస్తున్నాడు. కెప్టెన్సీతో పాటు బౌలింగ్ లోనూ సత్తా చూపిస్తున్నాడు.

కమ్మిన్స్ తర్వాత మరో ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ జోష్ హేజల్ వుడ్ టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్స్ లో నాలుగో స్థానంలో ఉన్నాడు. హేజల్ వుడ్ ఖాతాలో ప్రస్తుతం 815 పాయింట్లు ఉన్నాయి. స్కాట్ బోలాండ్ ఏకంగా ఆరో స్థానానికి దూసుకొచ్చాడు. ఈ ఏడాది ప్రారంభంలో టీమిండియాతో జరిగిన టెస్ట్ సిరీస్ లో అత్యత్తంగా రాణించిన స్కాట్.. ఇటీవలే వెస్టిండీస్ పై జరిగిన చివరి టెస్టులో తుది జట్టులో స్థానం సంపాదించి ఆరు వికెట్లు పడగొట్టాడు. ఈ టెస్ట్ రెండో ఇన్నింగ్స్ లో బోలాండ్ హ్యాట్రిక్ తో చెలరేగాడు. దీంతో పింక్ బాల్ టెస్ట్ లో హ్యాట్రిక్ తీసిన తొలి బౌలర్ గా చరిత్ర సృష్టించాడు. జస్టిన్ గ్రీవ్స్, షమర్ జోసెఫ్, జోమెల్ వారికన్‌లను వరుస బంతుల్లో బోలాండ్ ఔట్ చేశాడు.

ఆస్ట్రేలియా ప్రధాన స్పిన్నర్ నాథన్ లియాన్ 769 పాయింట్లతో 8 ర్యాంక్ లో కొనసాగుతున్నాడు. దశాబ్ద కాలంగా ఆసీస్ జట్టులో లియాన్ ఏకైక స్పిన్నర్ గా కొనసాగుతూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. యార్కర్ల వీరుడు మిచెల్ స్టార్క్ పదో స్థానంలో ఉన్నాడు. వెస్టిండీస్ తో జరిగిన చివరి టెస్టులో స్టార్క్ తన బౌలింగ్ తో విజృంభించి కేవలం 15 బంతుల్లోనే ఐదు వికెట్లు పడగొట్టి ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. దీంతో టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఫాస్టెస్ట్ 5 వికెట్లు పడగొట్టిన ప్లేయర్ గా చరిత్ర సృష్టించాడు. బుమ్రా అగ్ర స్థానంలో ఉండగా రబడా రెండో ర్యాంక్ లో కొనసాగుతున్నాడు. హెన్రీ(7), నోమన్ అలీ(5), మార్కో జాన్సెన్(9) టాప్-10 లో ఉన్న ఆటగాళ్లు.

## ఇండియా కూడా తప్పు చేసింది ఇంగ్లాండ్‌కే ఎందుకు పనిష్ మెంట్: ఐసీసీపై వాన్ అసంతృప్తి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా, ఇంగ్లాండ్ మధ్య ఇటీవలే జరిగిన మూడో టెస్టు థ్రిల్లర్ ను తలపించింది. లార్డ్స్ వేదికగా జరిగిన ఈ టెస్ట్ అసలైన టెస్ట్ క్రికెట్ మజా చూపించింది. ఇరు జట్ల మధ్య నువ్వా నేనా అన్నట్టుగా సాగిన ఈ టెస్టులో ఇంగ్లాండ్ 22 పరుగుల తేడాతో ఇండియాపై థ్రిల్లింగ్ విక్టరీ కొట్టింది. తొలి నాలుగు రోజులు టీమిండియా ఆధిపత్యం చూపించినా చివరి రోజు ఇంగ్లాండ్ అద్భుతమైన బౌలింగ్ తో సంచలన విజయం విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంతో ఇంగ్లాండ్ ఫుల్ ఖుషీగా ఉంటే ఐసీసీ ఊహించని షాక్ ఇచ్చింది. స్లో ఓవర్ రేట్ కారణంగా ఇంగ్లాండ్ జట్టుపై 10 శాతం జరిమానా విధించడమే కాదు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ లో రెండు పాయింట్లు కట్ చేసింది. ఈ టెస్టులో స్లో ఓవర్ రేట్ కారణంగా ఇంగ్లాండ్ జట్టుకు మాత్రమే జరిమానా విధించినందుకు ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ)ను బహిరంగంగా విమర్శించాడు. సోషల్ మీడియా ద్వారా ఈ ఇంగ్లాండ్ మాజీ బ్యాటర్ తన నిరాశను వ్యక్తం చేస్తూ.. "నిజాయితీగా చెప్పాలంటే, లార్డ్స్‌లో రెండు జట్ల ఓవర్ రేట్లు చాలా చాలా పేలవంగా ఉన్నాయి. ఒక్క జట్టును ఎలా మందలించారో నాకు అర్థం కాలేదు. న్యాయంగా ఉండటం అత్యంత ముఖ్యమైది. అన్ని జట్లకు క్రికెట్ పాలక మండలి సమాన న్యాయం అందేలా చూడాలి". అని వాన్ ఎక్స్ (గతంలో ట్విట్టర్)లో రాసుకొచ్చాడు. లార్డ్స్ టెస్టులో ఇంగ్లాండ్ జట్టు ఇండియా రెండో ఇన్నింగ్స్ లో 10 నిమిషాల పాట (రెండు ఓవర్లు ఆలస్యం) ఆలస్యం అయినట్టు.. ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ఈ నేరానికి పాల్పడినట్లు ఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ రూల్స్ లో భాగంగా ఆర్టికల్ 16.11.2 ప్రకారం ఒక జట్టుకు ప్రతి తక్కువ ఓవర్‌కు ఒక పాయింట్ జరిమానా విధించబడుతుంది. ఇంగ్లాండ్ రెండు ఓవర్లు ఆలస్యం వేసిన కారణంగా రెండు పాయింట్లలో కొత్త విధించారు. పాయింట్లు కట్ చేయడంతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ స్టాండింగ్స్‌లో ఇంగ్లాండ్ 24 నుండి 22కి పడిపోయింది. దీంతో వారి పాయింట్ల శాతం 66.67% నుండి 61.11%కి తగ్గింది. ఈ మ్యాచ్ విషయానికి వస్తే టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ లో 387 పరుగులకు ఆలౌటైంది. రూట్ (104) సెంచరీతో టాప్ స్కోరర్ గా నిలిచాడు, బుమ్రా 5 వికెట్లతో రాణించాడు. ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్ లో ఇండియా కూడా సరిగ్గా 387 పరుగులు చేసింది. రాహుల్ సెంచరీ చేసి ఇండియాను ఆదుకున్నాడు. భారత బౌలర్లు విజృంభించడంతో రెండో ఇన్నింగ్స్ లో ఇంగ్లాండ్ 192 పరుగులకే ఆలౌట్ అయింది. 193 పరుగుల లక్ష్య ఛేదనలో టీమిండియా 170 పరుగులకు ఆలౌట్ అయింది.

## నువ్వు సూపర్ స్టార్ అయినా అలా చేయడానికి కుదరదు: బుమ్రాకు గవాస్కర్ వార్నింగ్




**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా నాలుగో టెడ్స్ ఆడతాడా లేదా అనే విషయంపై సస్పెన్స్ కొనసాగుతోంది. పని భారం కారణంగా ఈ స్పీడ్ స్టార్ సిరీస్ లో ఏవైనా మూడు మ్యాచ్ లు మాత్రమే ఆడనున్నాడు. ఇప్పటికే బుమ్రా రెండు మ్యాచ్ లు ఆడేశాడు. మిగిలిన రెండు టెస్టుల్లో ఒకటే మ్యాచ్ ఆడతాడనే టాక్. రెండో టెస్టుకు ముందు ముందే బుమ్రా సిరీస్?లోని ఏవైనా మూడు మ్యాచులు మాత్రమే ఆడుతాడని.. మిగిలిన రెండు మ్యాచ్ ల్లో అతడి సేవలు కోల్పోతామని గిల్ రెండో టెస్టుకు ముందు క్లారిటీ ఇచ్చాడు. దీంతో బుమ్రా నాలుగో టెస్ట్ ఆడతాడా లేకపోతే ఐదో టెస్ట్ టెస్టులో బరిలోకి దిగుతాడా అనే విషయంపై చర్చల జరుగుతున్నాయి. 5 మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ లో ప్రస్తుతం ఇంగ్లాండ్ 2-1 ఆధిక్యంలో నిలిచింది. ఇండియా, ఇంగ్లాండ్ మధ్య నాలుగో టెస్ట్ మాంచెస్టర్ లో జూలై 23 నుంచి ప్రారంభమవుతుంది. సిరీస్ లో వెనకబడిన టీమిండియా ఓల్డ్ ట్రాఫర్డ్ లో జరగబోయే నాలుగో టెస్టులో ఓడిపోయితే సిరీస్ కోల్పోతుంది. దీంతో నాలుగో టెస్టులో ఎలాగైనా గెలవాలనే ఒత్తిడి భారత జట్టుపై ఉంది. ఈ మ్యాచ్ లో బుమ్రాకు రెస్ట్ ఇస్తారనే విషయంలో వస్తున్న ప్రచారంలో భాగంగా టీమిండియా దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ స్పందించాడు. ఈ టీమిండియా స్టార్ పేసర్ కు పరోక్షంగా వార్నింగ్ ఇచ్చాడు. గవాస్కర్ మాట్లాడుతూ.."ఏ సూపర్ స్టార్ ఆటగాడూ విశ్రాంతి తీసుకోకూడదు. మీరు ఇక్కడకు సెలవుల కోసం రాలేదు" అని గవాస్కర్ సోనీ స్పోర్ట్స్‌లో అన్నారు. గవాస్కర్ బుమ్రాను ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేసినట్టు స్పష్టంగా అర్థమవుతుంది. టీమిండియా వెటరన్ బ్యాటర్ చటేశ్వర్ పుజారా బుమ్రా చివరి టెస్ట్ ఆడకపోయినా పర్లేదు సిరీస్ కు కీలకమైన నాలుగో టెస్ట్ ఆడాలని సూచించాడు. మూడో టెస్ట్ ముగిసిన తర్వాత నాలుగో టెస్టుకు 10 రోజుల విరామం ఉంది. విరామం ఎక్కువ రావడంతో బుమ్రా నాలుగో టెస్ట్ ఆడాలని గవాస్కర్ గట్టిగా చెప్పాడు. లీడ్స్ వేదికగా జరిగిన తొలి టెస్టులో బుమ్రా ఆడాడు. ఈ మ్యాచులో ఈ పేసర్ చెలరేగి తొలి ఇన్నింగ్స్ లో ఐదు పడగొట్టిన టీమిండియాకు ఓటమి తప్పలేదు. రెండో టెస్టులో టీమిండియా ఖచ్చితంగా గెలవాల్సిన టెస్టులో బుమ్రా ఆడతాడని ప్రచారం జరిగినా అతనికి రెస్ట్ ఇవ్వడం జరిగింది. బుమ్రా లేని ఈ టెస్టులో టీమిండియా 336 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. తాజాగా ముగిసిన లార్డ్స్ టెస్టులో బుమ్రా రెండు ఇన్నింగ్స్ ల్లో కలిపి 7 వికెట్లు పడగొట్టిన టీమిండియా 22 పరుగుల తేడాతో ఓడిపోయింది.



చైత్ర జె ఆచార్ క్లాసిక్ బ్లాక్ అండ్ వైట్ చీరలో వింటేజ్ కూల్‌ను ప్రసరిస్తుంది

## 'డాన్ 3' విలనీ: VD ఎగ్జిట్‌కి కారణమేమిటి?



కింగ్ ఖాన్ షారూఖ్ ని కాదనుకుని ప్రస్తుతం రణ్‌వీర్ సింగ్ ని డాన్ పాత్రలో చూపించేందుకు ప్రయత్నిస్తున్నాడు ఫర్హాన్ అక్తర్. అతడు %-%డాన్%-% ఫ్రాంఛైజీలో మూడో భాగం %-%డాన్ 3%-%ని ప్రకటించి చాలా కాలమే అయినా చిత్రీకరణ ప్రారంభం కావడానికి ఏళ్లుగా ఎదురు చూడాల్సి వచ్చింది. ఇప్పటికీ ఈ సినిమాకు సరైన విలన్ దొరక్కపోవడం నిరాశపరుస్తోంది. షారూఖ్ మొదటి రెండు భాగాల్లో అద్భుత నటనతో ప్రజల్ని అలరించాడు. ఇప్పుడు రణ్ వీర్ ఈ పాత్రలో ఎలా మెప్పిస్తాడో చూడాలన్న ఆసక్తి ఉంది. అయితే ఈ ప్రాజెక్ట్ అంతకంతకు ఆలస్యమవుతున్నట్టే కనిపిస్తోంది.డాన్ 3లో విలన్ గా ప్రతిభావంతుడైన యువనటుడు విక్రాంత్ మాస్సేకు అవకాశం కల్పించినా తిరస్కరించాడని కథనాలొచ్చాయి. సృజనాత్మక అసంతృప్తి కారణంగా విక్రాంత్ ఈ పాత్రను వదులుకున్నట్టు ప్రచారం సాగుతోంది. అతడు రిజెక్ట్ చేసాక, అదే పాత్ర కోసం టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండను దర్శకనిర్మాతలు సంప్రదించారని కూడా కథనాలొచ్చాయి. వీడీ కూడా ఈ పాత్రను కాదనుకున్నాడు. ప్రస్తుతం దేవరకొండ తెలుగులో వరుస చిత్రాలకు కాల్షీట్లు ఇచ్చాడు. అలాగే దీర్ఘ కాలిక ప్రణాళిక ప్రకారం ఈ విలన్ పాత్ర తన ఇమేజ్ కి ఇబ్బందులు క్రియేట్ చేస్తుందని కూడా అతడు భావించినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. కారణం ఏదైనా కానీ, ఒక భారీ యాక్షన్ చిత్రంలో విక్రాంత్ మాస్సే, విజయ్ దేవరకొండ లాంటి స్టార్లు నటించే అవకాశాల్ని వదులుకోవడం ఆశ్చర్యపరిచింది.

ఫర్హాన్ బృందం తదుపరి ఈ పాత్ర కోసం వేరొక నటుడిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. సృజనాత్మక వైరుధ్యాలు, పాత్ర పరిమితులు, హీరో ఇమేజ్ వగైరా అంశాలు ఈ వైఫల్యానికి కారణం కావొచ్చు. దానిని సరిదిద్దుతూ సరైన నటుడిని ఈ పాత్రకు ఎంపిక చేయాల్సి ఉంటుంది.రణ్ వీర్ సింగ్ లాంటి ఎనర్జిటిక్ హీరోకు మ్యాచ్ చేసేలా భీకర విలన్ గా ఢీకొట్టడానికి విజయ్ దేవరకొండ సరిపోతాడు. కానీ అతడు నిరాకరించడానికి కారణం ఆ పాత్రను ఆశించినంత పవర్ ఫుల్ గా డిజైన్ చేయకపోవడమేనని భావి స్తున్నారు. అయితే రణ్ వీర్ ఫ్యాషన్ సెన్స్ ని ఫాలో చేసే హీరోగా వీడీకి గుర్తింపు ఉంది. అందుకే భవి ష్యత్ లో ఆ ఇద్దరూ కలిసి నటించాలని కూడా అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.



నభా నటేష్ లైమ్ ఎల్లో మరియు పాతకాలపు వైబ్స్‌లో మెరుస్తోంది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com